అమరావతి
ఆదివారం
6-1-2019
సంపుటి: 3, సంచిక: 29
పేజీలు: 8+8, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం అక్షర యజ్ఞం...

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM



ఎస్ఎస్ఏలో రాజకీయం!

పోస్టుల భర్తీలో నేతల సిఫార్సులకే పెద్దపీట

- హాట్‌కేకుల్లా నాన్‌టీచింగ్ పోస్టులు
- ఎడా పెడా... నాయకుల వసూళ్లు
- చెప్పినవారికే ఇవ్వాలంటూ హుకుం
- లేకుంటే అంతుచూస్తామని బెదిరింపు
- మంత్రుల మధ్య కుదరని సయోధ్య
- సమిధలా మారిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ
- మంత్రి ఓఎస్‌డీ డిమాండ్ రూ.50 వేలు
- ఎంఈవోలు, ఎస్‌వోలకు బెదిరింపులు
- నియామకాల నిలిపివేతకు ఆదేశాలు



(శ్రీకాకుళం-మనం న్యూస్‌బ్యూరో)

సర్వశిక్షా అభియాన్‌లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ రాజకీయ చట్రంలో ఇరుక్కుంది. అసలే ఇది ఎన్నికల ఏడాది.. మేం చెప్పిన వారికే ఉద్యోగాలు ఇవ్వాలి. లేకుంటే సంగతి చూస్తామంటూ ప్రజాప్రతినిధులు ఒక వైపు.. నిబంధనలు పాటించాల్సిందేనంటూ అధికారులు మరో వైపు హుకుం జారీ చేస్తున్నారు. అందరూ

..మిగతా 2లో



శ్రీకాకుళం.. నెం.1

రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెడతాం

- భుజస్కంధాలపై రైతుల కష్టాలు.. పెద్ద కొడుకుగా అండగా ఉంటా
- పండుగలన్నింటికీ కానుకలిస్తున్నా.. నిరుపేదల కోసం 30 లక్షల ఇళ్లు
- వ్యవసాయాభివృద్ధికి సమగ్ర చర్యలు.. శ్రీకాకుళానికి గోదావరి నీళ్లు తెస్తా
- సీఎం చంద్రబాబునాయుడు వెల్లడి.. రాజాంలో జన్మభూమి- మా ఊరు

2



ఫోను లేదు బాబోయ్!

2018లో కేంబ్రిడ్జి డిక్షనరీ పదం..నోమోఫోబియా

మనం సండే స్పెషల్

- ఎక్కువ మంది వెతికిన పదం.. ఇదే
- మొబైల్ ఫోన్ లేకపోతే ఎలాగని భయం
- ఫోను లేనిదే.. ఒక్క క్షణమైనా ఉండలేరు
- టెక్నాలజీకి బానిసలవుతున్న కొత్త తరం
- బ్యాటరీ అయిపోతున్నా.. ఒకటే ఆందోళన
- నెట్ వర్క్ కవరేజి లేకపోయినా అదే పరిస్థితి
- పురుషుల్లో 58%.. మహిళల్లో 47% మంది
- ఒకరితో ఒకరికి తగ్గిపోతున్న సంభాషణలు
- అయితే వాట్సాప్‌లో మెసేజ్.. లేదా ట్వీట్లు
- ఫోను స్విచాఫ్ చేయనిది సగం మందికి పైనే

(మనం సెంట్రల్ డెస్క్)

మీ చేతిలో లేదా జేబులో మొబైల్ ఫోన్ లేకుండా ఎంతసేపు ఉండగలరు? లేదా.. మీ ఫోన్ బ్యాటరీ అయిపోతున్నా, లేదా సిగ్నల్ లేకపోయినా టెన్షన్ పడుతున్నారా? అయితే మీకు నోమోఫోబియా లక్షణాలు కనిపిస్తున్నట్లే. ఇదెక్కడి ఫోబియా అని కంగారు పడకండి.. నోమో అంటే 'నో మొబైల్ ఫోన్' అని అర్థమట. ఫోన్ దూరమైపోతే ఎలాగని కంగారు పడేవాళ్లకు నోమోఫోబియా ఉందని చెబుతున్నారు. అంతేకాదు.. ఈ పదాన్ని 2018 సంవత్సరం మొత్తమ్మీద ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ వాళ్లు వర్డ్ ఆఫ్ ద ఇయర్ అని కూడా తేల్చేశారు. ఎక్కువ మంది

..మిగతా 2లో

60%

వచ్చే ఎన్నికల్లో కొత్తవారికి టికెట్లు

- వ్యాపారంగా మారిన రాజకీయాలు
- సమస్యలు పరిష్కరించే ఓపికే లేదు
- ప్రజలకు అండగా ఉంటే ఆదరణ
- అన్ని కులాల ఐక్యవేదిక జనసేన
- కాన్షీరాం స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ
- రిస్కు చేయడానికి జనసేన సిద్ధం
- పార్లమెంటరీ కమిటీలు నేనే వేస్తా
- అభిమానులతో నేనే టచ్‌లో ఉంటా
- జిల్లా నాయకులతో పవన్ కల్యాణ్



విజయవాడ, జనవరి 5:

వచ్చే ఎన్నికల్లో 60 శాతం మంది కొత్త వ్యక్తుల్ని బరిలోకి దింపుతానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ప్రకాశం జిల్లా లాంటి ప్రాంతంలో దీన్ని తప్పకుండా పాటిస్తానని పేర్కొన్నారు. తాను పార్టీ పెట్టినప్పుడు

..మిగతా 2లో

జగన్ @ 3600

కీలక మైలురాయి చేరుకున్న పాదయాత్ర

- బారువ జంక్షన్ వద్ద వేపమొక్క
- లక్కవరం వరకు చేరిన యాత్ర
- పార్టీలోకి పలువురు నేతల చేరిక
- జన్మభూమి కమిటీలపై మండిపాటు

2



ఇదీలోకం!



అయ్యో.. చలికి వణకకు!
కొత్తవి పంపడానికి ప్రయత్నిస్తా..!!

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం,
దక్షిణాయనం, హేమంత ఋతువు,
పుష్య మాసం, తిథి: శుక్లపక్షం, పాడ్యమి పూర్తి,
నక్షత్రం: పూర్వాషాఢ సా.5.11 వరకు,
తదుపరి ఉత్తరాషాఢ,
వర్జ్యం: రా.1.52 నుంచి 3.37 వరకు,
దుర్ముహూర్తం: సా.4.07 నుంచి 4.53 వరకు,
రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు,
యమగండం: ప.12.00 నుంచి 1.30 వరకు,
అమృతఘడియలు: ప.11.55 నుంచి 1.40 వరకు

ఒంటరి పోరుకు రెడీ

ఉత్తరప్రదేశ్‌లో ఒక్కరమే పోటీ చేస్తాం



- కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టీకరణ
- ఎస్పీ - బీఎస్పీ మైత్రి ఖరారు..
- మాకు కూటమి ముఖ్యం కాదు
- మా కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు
- రాజ్యసభ సభ్యుడు పీఎల్ పునియా
- కాంగ్రెస్‌పై ఎస్పీ, బీఎస్పీ మండిపాటు

2

మాల్యాపై ముద్ర

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటన

- దేశంలో మొట్టమొదటి వ్యాపారవేత్త
- కొత్త చట్టం.. తొలిసారి మాల్యాపైనే
- భారత్‌కు పంపుతామన్న యూకే కోర్టు
- బ్యాంకులకు రూ.9వేల కోట్ల మేర టోపీ
- త్వరలో మరికొందరిపై ముద్రకు చాన్స్



ముంబై, జనవరి 5:

'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు' అనే ముద్ర మన దేశంలో మొట్టమొదటి సారిగా విజయ్ మాల్యాపై పడింది. దేశంలో కొత్తగా ప్రవేశపెట్టిన అవినీతి నిరోధక చట్టం కింద ముంబైలోని కోర్టు ఆయనను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలుచేసిన పిటిషన్‌ను విచారిస్తున్న అవినీతి నిరోధక న్యాయస్థానంలో.. మాల్యాను ఈ విధంగా ప్రకటించాలని ఈడీ కోరింది. ప్రభుత్వ రంగ బ్యాంకులలో వేలాది కోట్ల మేర అప్పులు తీసుకుని, వాటిని తీర్చకుండా విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా, నీరవ్‌మోదీ, మెహుల్ చోక్సీ తదితర వ్యాపారవేత్తలపై గత కొన్ని నెలలుగా ప్రభుత్వ దర్యాప్తు

..మిగతా 2లో

ఎస్‌ఎస్‌ఏలో రాజకీయం!

(మొదటి పేజీ తరువాయి)

కలిసి సిఫార్సులు చేయడంతో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ పరిస్థితి గొంతులో వెలక్కాయపడ్డట్లయింది. మింగమంటే కప్పకు కోసం.. విడవమంటే పాముకు కోపం అనుకుని, అధికారులు ఇచ్చిన రోస్టర్ ప్రకారం భర్తీ చేసుకుపోదామని.. ముందుకెళ్లిన ఏజెన్సీ ప్రతినిధులకు అడుగడుగునా అవరోధాలే. మంత్రులు, ఎమ్మెల్యేలు.. ఇలా ఎవరి స్థాయిలో వారి నుంచి బెదిరింపులు, బ్లాక్‌మెయిళ్లు ఎదురవుతున్నాయి.

ఇదీ అసలు కథ..

సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ)లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీకాకుళం జిల్లాలో 207 పోస్టులను పొరుగు సేవల ఏజెన్సీ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించుకుని, పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన స్కాట్లాండ్ ఏజెన్సీకి అప్పజెప్పింది. ప్రభుత్వంతో ఒప్పందం కుదరడంతో ఏజెన్సీ రంగంలోకి దిగి.. పని ప్రారంభించింది. కలెక్టర్, ఎస్ఎస్ఏ పీవోలను కలిసి వివరాలు సేకరించింది. వారు సూచించిన మేరకు రోస్టర్ పాయింట్ పాటిస్తూ ఉద్యోగాల భర్తీ చేపట్టింది. ఇంతలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, ఒక్కో పోస్టుకు లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో ఉద్యోగాల భర్తీని నిలిపివేస్తూ.. రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. కొద్ది రోజుల తర్వాత చీఫ్ సెక్రటరీ, విద్యాశాఖ అధికారులు అన్ని జిల్లాల ఏజెన్సీ



ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి.. భర్తీ ప్రక్రియపై మార్గదర్శకాలు జారీ చేశారు. టీచింగ్ పోస్టులను ఎస్ఎస్ఏ ద్వారా భర్తీ చేయాలని, నాన్‌టీచింగ్ పోస్టులు ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు జీవోను కూడా విడుదలైంది. దీంతో ఏజెన్సీ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అంతా సజావుగా సాగిపోతున్న తరుణంలో రాజకీయ ప్రకంపనల పుణ్యమాని మళ్లీ ప్రక్రియ నిలిపివేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. దీంతో ఇప్పటి వరకు ఉద్యోగాలు పొందిన వారు, ఆశావహులు అంతా గందరగోళానికి గురవుతున్నారు.

రాజకీయ నాయకుల రంగప్రవేశం..

ఈ పోస్టులపై రాజకీయ నాయకుల కన్ను పడింది. ఎలాగైనా తమవారికి కట్టబెట్టాలని పట్టుబడుతున్నారు. నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యే సైతం.. ఎంఈవోలను బెదిరిస్తున్నారని ఆరోపణలున్నాయి. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎంపీపీలు.. మంత్రుల ఓఎస్డీలు.. ఇలా ఎవరుపడితే వారు తమ జాబితాలను ఏజెన్సీకి అందజేసేశారు. ఒకరికొకరు పోటీ పడుతూ.. సిఫార్సులు చేసేస్తున్నారు. వాళ్లతో గొడవలెందుకని సిఫార్సులను ఏజెన్సీ ప్రతినిధులు చాలా వరకు ఓకే చేసేశారని సమాచారం. అనీ అక్కడక్కడైనా అర్హులకు ఇవ్వకపోతే తర్వాత సమాచారహక్కు చట్టంతో కోర్టును ఆశ్రయించే ప్రమాదం ఉందని.. అక్కడక్కడ కాస్తంత న్యాయంగా వ్యవహరించారు. ఇదే రాజకీయ నాయకుల అక్కసుకు కారణమైంది. దీంతో ఎంఈవోలు, కేజీబీవీ ఎస్‌వోలను పిలిపించుకుని.. తాము చెప్పిన అభ్యర్థులు వస్తేనే చేర్చుకోవాలని, లేకుంటే చేర్చుకోవద్దని హుకుం జారీ చేశారు. ఇక జిల్లాకు చెందిన ఒక మంత్రి ఓఎస్డీ అయితే.. తానే ఆర్డర్లు తెస్తానని, అప్పటివరకు ఎవర్నీ చేర్చుకోవద్దని చెప్పారని సమాచారం. అలాగే.. ఇప్పటికే తమ నియోజకవర్గ పరిధిలో చేరిన వారు ఒక్కొక్కరూ తమకు రూ.50 వేల చొప్పున ఇవ్వాలని కూడా ఆదేశిస్తున్నారట. తమకు తెలియకుండా ఎవరికి ఆర్డర్లు ఇచ్చినా అంగీకరించేది లేదని సదరు ఏజెన్సీ ప్రతినిధులను బెదిరించారట. అలాగే.. తాము సిఫార్సులు చేసిన 8 మందికి పోస్టింగులు ఇప్పించుకున్నారని సమాచారం. మరో వైపు.. తాను చెప్పిన అభ్యర్థి వచ్చే వరకు ఎవరినీ చేర్పించుకోవద్దని, ఒక వేళ చేర్చుకుంటే.. అంతు చూస్తానని ఓ ఎమ్మెల్యే తన పరిధిలోని ఒక ఎంఈవోను బెదిరించారని సమాచారం. దీంతో అర్హత ఉండి.. ఉద్యోగం పొందిన అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

మంత్రుల మధ్య కుదరని సయోధ్య

ఉద్యోగాల భర్తీలో మంత్రులు ఒకరికొకరు పోటీపడుతూ.. తాము డబ్బులు తీసుకున్నవారికి కట్ట బెట్టేశారు. కానీ జిల్లాలోని ఇద్దరు మంత్రుల మధ్య ఈ విషయంలో కోల్డ్ వార్ సాగుతోంది. ఒకరి వ్యవహారంలో మరొకరు తలదూరుస్తూ.. పోస్టింగ్‌ల విషయంలో పట్టుదలకు పోతున్నారు. ఒకరు చెప్పినవారికి ఉద్యోగం ఇస్తే.. ఇంకో పేషీకి కోపం వస్తోంది. దీంతో ఏం చేయాలో తోచక ఏజెన్సీ ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. ఇంతలో భర్తీ ప్రక్రియ నిలిపివేయాలంటూ ఆదేశాలు రావడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

కలెక్టర్ దృష్టి

ఈ పోస్టుల భర్తీ వ్యవహారంపై కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. పోస్టులను ఎక్కడెక్కడ ఎలా భర్తీ చేశారో తనకు వివరణ ఇవ్వాలని ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ఇంతలో మిగిలిన ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలంటూ పైనుంచి ఆదేశాలు అందాయి. ఈ విషయంపై స్కాట్లాండ్ ఏజెన్సీ ప్రతినిధులను మనం ప్రతినిధి ఫోన్‌లో ప్రశ్నించగా.. తమ కుటుంబసభ్యుల అనారోగ్య కారణాల రీత్యా సొంత ఊరికి వెళుతున్నామని, సోమవారం వచ్చి అధికారులను కలిసి వివరణ ఇస్తామని చెప్పారు. ఇక కలెక్టర్ ఏం చేస్తారో వేచి చూడాల్సిందే!

మాల్యాపై ముద్ర

(మొదటి పేజీ తరువాయి)



సంస్థలు గట్టిగా దృష్టిపెట్టాయి. దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడి తర్వాత విదేశాలకు పారిపోయిన వాళ్లను పట్టుకునేందుకు పార్లమెంటు ఆమోదించిన కొత్త చట్టానికి రాష్ట్రపతి కూడా గత సంవత్సరం ఆగస్టు నెలలో ఆమోదముద్ర వేశారు. ఇలా దేశం వదిలి పారిపోయిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేకపోవడంతో అలా వెళ్లకుండా చూసేందుకు ఈ చట్టం చేశారు. దాని ప్రకారం ఎవరైనా ఒక వ్యక్తిని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించాలంటే రూ. 100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ విలువ చేసే ఆర్థిక నేరాలుండి, వారిపై అరెస్టువారంటు జారీ అయ్యి, ప్రాసిక్యూషన్ నుంచి తప్పించుకోడానికి భారతదేశాన్ని వదిలిపెట్టి పారిపోయి ఉండాలి. ఇలా ఒకసారి ప్రకటించారంటే, వాళ్ల పేరుమీద భారతదేశంతో పాటు విదేశాలలో ఎక్కడైనా ఎలాంటి ఆస్తిపాస్తులున్నా వాటన్నింటినీ సదరు విచారణ సంస్థలు (ఈడీ, సీబీఐ) స్వాధీనం చేసుకుని వేలం వేసేందుకు కూడా అధికారం వస్తుంది. తద్వారా వాళ్లు బ్యాంకులకు ఎగవేసిన మొత్తంలో కొంతయినా తిరిగి సంపాదించేందుకు వీలు కుదురుతుంది.

ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన పెద్ద నేరస్థులందరూ కొన్ని వేల కోట్ల మేర ప్రభుత్వ రంగ బ్యాంకులను ముంచేసినట్లు తెలుస్తుండటంతో.. క్రమంగా అందరిపైనా ఈ చట్టాన్ని ప్రయోగించే అవకాశం కనిపిస్తోంది. వారిలో అందరికంటే ముందుగా విజయ్ మాల్యాపైనే ఈ ముద్ర పడటం విశేషం. కాగా, గత నెలలో మాల్యాను తదుపరి విచారణ కోసం భారతదేశానికి పంపించాలని ఇంగ్లండ్‌లోని ఒక కోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పేరున రూ. 9000 కోట్లకు పైగా రుణాలు తీసుకుని వాటిని తిరిగి చెల్లించని నేరంలో మాల్యా కోసం భారత్ ప్రయత్నిస్తోంది. భారత ప్రభుత్వం మాల్యాను ఉంచబోయే జైలు వీడియో ఫుటేజీ కూడా పంపించడంతో.. తాము అన్ని విధాలుగా సంతృప్తి చెందినట్లు కోర్టు తెలిపింది.

ఫోను లేదు బాబోయ్!

(మొదటి పేజీ తరువాయి)



నెటిజన్లు ఈ పదానికే ఓటేశారంటే వాళ్లలో చాలామందికి ఈ రకం ఇబ్బంది ఉన్నట్లేనని భావించాల్సి వస్తోంది. నిజానికి ఇది శాస్త్రీయ పదం కానే కాదు. కానీ ఇటీవలి కాలంలో చాలామంది పరిశోధకులు ఈ పదాన్ని విస్తృతంగా వాడాల్సిన అవసరం వస్తోంది. కొత్త తరం జనాలు టెక్నాలజీకి బాగా బానిసలు అయిపోతుండటంతో.. ఇంతకుముందు కంటే ఇప్పుడు సరికొత్త పదాలను వాళ్ల కోసం కనిపెట్టాల్సి వస్తోందంటున్నారు.

ఏంటీ నోమోఫోబియా

కేవలం ఫోన్ చేతిలో లేకపోవడమే కాదు, ఫోన్ ఉన్నా సరైన నెట్‌వర్క్ లేకపోవడం వల్ల తాము వాట్సాప్ మెసేజిలు చూసుకోలేకపోవడం లేదా పంపలేకపోవడం లాంటి పరిస్థితిలో కూడా విపరీతమైన ఆందోళనకు గురవుతున్నవారిని నోమోఫోబియా బాధితులుగా చెబుతున్నారు. రోజుకు సగటున ఐదు గంటలు లేదా అంతకంటే ఎక్కువగా స్మార్ట్‌ఫోన్లను ఉపయోగిస్తున్నారని తాజా సర్వేలలో తేలింది.

నెట్‌తోనే అసలు సమస్య

ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చిన తొలినాళ్ల నుంచే దానికి ప్రజలు బానిసలుగా మారుతున్న విషయాన్ని మానసిక శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు. ఇంటర్‌నెట్ గేమింగ్ డిజార్డర్ గురించి మరింతగా పరిశోధించాల్సి ఉందని అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ 2013లోనే చెప్పింది. ఆ తర్వాత స్మార్ట్‌ఫోన్‌కు బానిసలు కావడం గురించి ఇక చర్చించుకోవడమే అనవసరం అనిపించింది. ఎంత చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా యువత మాత్రం స్మార్ట్‌ఫోన్లను చేతుల్లోంచి తీసి పక్కన పెట్టడం లేదని.. అది లేనిదే ఒక్క నిమిషం కూడా ఉండలేకపోతున్నారని అన్నారు. రెండు రకాల మానసిక సమస్యలు ప్రధానంగా ఈ తరహా ప్రవర్తన వల్లే వస్తున్నాయని యేల్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ సైకియాట్రీ అండ్ న్యూరోసైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క్ పొటెంజా చెప్పారు. ఆ తర్వాత కూడా నోమోఫోబియా గురించి పలు సందర్భాలలో పలువురు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. 'అండర్‌స్టాండింగ్ నోమోఫోబియా' అనే అంశంపై సిటీ యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్, సంగ్ క్యున్‌క్వాన్ యూనివర్సిటీ పరిశోధకులు ఒక పరిశోధన పత్రాన్ని సమర్పించారు. స్మార్ట్‌ఫోన్లు కూడా తమ శరీరంలో భాగం లాంటివేనని భావించినపుడు వాళ్లు వాటికి బాగా ఎక్కువగా అలవాటు పడిపోతారని, ఫోన్ తమకు అత్యంత సమీపంలోనే ఉండాలనే తపన వారిలో పెరిగిపోతుందని సైబర్ సైకాలజీ, బిహేవియర్ అండ్ సోషల్ నెట్‌వర్కింగ్ జర్నల్‌లో ప్రచురితమైన వ్యాసంలో పరిశోధకులు రాశారు.

ప్రధానంగా హైస్కూలు, కాలేజి విద్యార్థులలో ఈ తరహా ప్రవర్తన ఎక్కువగా కనిపిస్తోందని చెబుతున్నారు. ఒకరితో ఒకరు వ్యక్తిగతంగా మాట్లాడుకోవడం తగ్గించేసి వాట్సాప్‌లో మెసేజ్ చేయడం లేదా ట్వీట్ చేయడం ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లోనూ ఈ నోమోఫోబియా లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మొదటి పరిశోధన ఇలా...

తొలిసారి 2010 సంవత్సరంలో నోమోఫోబియాపై ఇంగ్లండ్‌లోని ఒక పోస్టాఫీసు పరిశోధన చేయించింది. మొబైల్ ఫోన్ యూజర్లు అది లేనపుడు ఎంత ఆందోళనకు గురవుతున్నారో చూడాలని చెప్పింది. అప్పుడు తమ ఫోన్ పోయినా, బ్యాటరీ అయిపోతున్నా, అందులో తగినంతగా డబ్బులు లేకపోయినా, నెట్‌వర్క్ కవరేజి సరిగా లేకపోయినా 53% మంది బ్రిటిషర్లు ఆందోళనకు గురవుతున్నట్లు ఆ సర్వేలో తేలింది. సగటున 53 శాతం మంది పురుషులు, 47 శాతం మంది మహిళలు ఈ తరహా సమస్యతో బాధపడుతున్నారు. ఫోను లేకపోతే తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో టచ్‌లో ఉండలేమన్న కారణంగానే ఆందోళనకు గురవుతున్నామని సర్వే చేసినవారిలో దాదాపు 55%మంది చెప్పారు. అమెరికా లాంటి దేశాలలో అయితే ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడి కాలేజీ విద్యార్థులలో మూడింట రెండొంతుల మంది ఫోను కూడా పక్కనే పెట్టుకుని పడుకుంటున్నారు. చివరకు తమ జీవిత భాగస్వాములతో శృంగారంలో ఉన్నా కూడా ఫోన్ వస్తే ఆన్సర్ చేస్తున్నామని 34% మంది అంగీకరించారు. నడకకు వెళ్లేటపుడు కాళ్లకు బూట్లు వేసుకోవడం అయినా మర్చిపోతారు గానీ ఫోన్ తీసుకెళ్లడం మాత్రం మర్చిపోరట. సగం మందికి పైగా ఎప్పుడూ జీవితంలో ఫోన్ స్విచాఫ్ చేయలేదు. ఒకప్పుడు సెల్ ఫోన్లు, టాబ్లెట్లు, పీసీలు, ల్యాప్‌టాప్‌లు రావడం వల్ల జీవితం సుఖవంతం అవుతుందని అనుకునేవారు, పని సామర్థ్యం పెరుగుతుందని భావించేవారు. కానీ పరిస్థితి పూర్తిగా తలకిందులైందని యేల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చెప్పారు.

ఏం చేస్తే మేలు..?

పగటిపూట ప్రతిరోజూ కొంతసేపు ఫోన్లు పూర్తిగా స్విచాఫ్ చేసి ఎదురుగా ఉన్నవారితో నేరుగా మాట్లాడేందుకు ప్రయత్నించాలి.ప్రతి వారం స్క్రీన్ చూసే సమయాన్ని, అవతలి వాళ్ల ముఖాలు చూసే సమయాల్ని సమన్వయం చేసుకోవాలి. ఒక గంట సేపు స్క్రీన్ చూస్తే.. మరో గంట అవతలివాళ్లను చూస్తూ, మాట్లాడాలి.ప్రతినెలా టెక్నాలజీ ఉపవాసాన్ని పాటించండి. అంటే ఒక రోజంతా కంప్యూటర్ గానీ, టాబ్ గానీ, ఫోన్ గానీ వాడకూడదు. అప్పుడు చాలా స్వతంత్రం వచ్చినట్లు అనిపిస్తుంది.నిద్రపోయేటప్పుడు కనీసం 15 అడుగుల దూరంలో ఫోన్ ఉంచుకోవాలి. అలారం మోగినపుడు స్నూజ్ చేయాలంటే లేవాల్సి వస్తుంది గానీ, అదే మంచిది.రోజు మొత్తంలో సమయాన్ని విభజించుకోవాలి.. ఫోన్‌తో ఎంతసేపు, స్నేహితులతో ఎంతసేపు, కుటుంబ సభ్యులతో ఎంతసేపు గడుపుతున్నామో చూసుకోవాలి.

60%

(మొదటి పేజీ తరువాయి)

అందులో పెద్ద నాయకులు ఎవరూ లేరని, యువతను నమ్మి పార్టీ పెట్టానని, వారే తనకు వెన్నెముక అని అన్నారు. శనివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్తూరు, ప్రకాశం జిల్లాల జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పీఆర్పీ ఆవిర్భావానికి బలమైన పాత్ర పోషించిన వారిలో తాను ఒకడినని, పార్టీ పెట్టడానికి చిరంజీవికి ప్రేరణ కలిగించిన వారిలో తానూ ఉన్నానని వెల్లడించారు. ప్రజారాజ్యం వల్ల సామాజిక న్యాయం జరిగి ఉండేదని, ఓపిక లేని నాయకులు పార్టీలో చేరినందు వల్ల ఆ అవకాశం చేజారిందని తెలిపారు. అన్ని పార్టీలలోని నాయకులు రాజకీయాల్లో వారు పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా మాట్లాడేవారేనని, ప్రజలకు అనుగుణంగా మాట్లాడేవారు కనుమరుగైపోతున్నారని అన్నారు. రాజకీయాలు పూర్తిగా వ్యాపారం అయిపోయాయని, పింఛన్లు, రేషన్ కార్డుల్లాంటి చిన్న సమస్యలు పరిష్కరించే ఓపిక కూడా నేతల్లో కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు కులాలు, మతాల్ని చూసి నష్టాన్ని కలిగించవని, అన్ని కులాల వారు ప్రకృతి దృష్టిలో సమానమేనని అన్నారు. అన్ని కులాలు ఐక్యంగా పనిచేసే సందర్భాలు ఉంటాయని, అటువంటిదే జనసేన అని పవన్ స్పష్టంచేశారు.

కాన్షీరాం స్ఫూర్తి

''ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలంటే 2 వేల కోట్లు అవసరం అని చాలామంది నాతో అంటున్నారు. ఇప్పుడున్న రాజకీయ పక్షాలు అందుకు సన్నద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. ఆ పార్టీలతో నువ్వెలా పోటీ పడతావని



ప్రశ్నిస్తున్నారు. నేను వారికి ఒకటే చెబుతున్నాను. ఈ విషయంలో నాకు కాన్షీరాం స్ఫూర్తి. రాజకీయాలు నడపడానికి డబ్బు అవసరం లేదని రుజువు చేసిన మహానేత ఆయన. నాకు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆయనే స్ఫూర్తి'' అని పవన్ అన్నారు.

చిరంజీవిని బలహీనుడిగా మార్చేశారు

''పీఆర్పీ అనుభవాలు దృష్టిలో పెట్టుకుని నేను పార్టీ కమిటీల నియామకానికి తొందరపడలేదు. ఆనాడు పీఆర్పీలోకి వచ్చిన వారు పదవీ వ్యామోహంతో చిరంజీవి వంటి ఒక బలమైన వ్యక్తిని బలహీనుడిగా మార్చేశారు. అందువల్ల పార్టీ నిర్మాణంలో నేను ఆచితూచి ముందుకి వెళ్తున్నాను. రాజకీయాల్లో ఎదగాలంటే కనీసం పాతికేళ్లు ఓపిక పట్టాలి. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ రాజకీయాలలో మధ్యే మార్గం (మిడిల్ పాత్) అవసరం. అటువంటి మధ్యే మార్గమే జనసేన పార్టీ'' అని పవన్ పేర్కొన్నారు.

రిస్క్ చేద్దాం..

రిస్క్ చేయకపోతే కొత్తదనం రాదని, అలాంటి రిస్క్ జనసేన చేస్తుందని చిత్తూరు జిల్లా నేతల సమీక్ష సమావేశంలో పవన్ చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ఎవరెవరో చేసిన తప్పులకు అమాయకులైన ప్రజలు శిక్ష అనుభవించారని, సొంత రాష్ట్రంలోనే పరాయివాళ్లుగా మిగిలిపోయే పరిస్థితులు వచ్చాయని, దానివల్లే జనసేన పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. పీఆర్పీ వచ్చిన సమయంలో రాజకీయంగా అనేక దెబ్బలు తిన్నామని.. దెబ్బలు తినే కొద్దీ తాను మరింత రాటు తేలతానని చెప్పారు. 60 ఏళ్ల రిటైర్మెంట్ తర్వాత తాను రాజకీయాల్లోకి రాలేదని, నటుడిగా హై డిమాండ్ ఉన్న ఉచ్ఛస్థితిలో వచ్చానని అన్నారు. తన అభిమానులు తనతోనే కనెక్ట్ అవుతారని, అందువల్ల పార్టీలో ఉన్న అభిమానులందరితో తానే కాంటాక్ట్‌లో ఉంటాన ని పవన్ చెప్పారు. వాళ్లకు ఏం చేయాలో తానే నేరుగా ఆదేశాలు అందిస్తానన్నారు. అంతా బూత్ కమిటీల గురించి మాట్లాడుతున్నారు, టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీలకు నిజంగా బూత్ కమిటీలు ఉన్నాయా అని ప్రశ్నించారు. వామపక్షాలు, బీజేపీలకు కొంతవరకు ఉన్నా వాళ్లు ఎందుకు గెలవడం లేదని అడిగారు. జనసేన ఇంకా ప్రారంభ దశలోనే ఉందని, సంస్థాగత పటిష్ఠతకు కొంత సమయం పడుతుందని చెప్పారు. వ్యక్తిగతంగా ప్రజాబలం ఉన్న వ్యక్తులు జనసేనలోకి వస్తే, వారికి జనసేన బలం తోడై విజయానికి చేరువవుతారని.. అలాంటివారికి తన బలం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

సామాన్యుల గ్లాసే గుర్తు..

తమకు తెలియకుండానే మనకు సామాన్యులు వాడే గ్లాసు ఎన్నికల గుర్తుగా వచ్చిందని.. కాలం అనుకూలంగా ఉందనడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని పవన్ కల్యాణ్ చెప్పారు. రాబోయే ఎన్నికలు మొదటివో, చివరివో కాదని.. ఇది ప్రారంభమేనని, భవిష్యత్తు అంతామనదేనని చెప్పారు. తొలుత పార్లమెంటు సెగ్మెంట్ స్థాయిలో కమిటీలను తానే స్వయంగా నియమిస్తానన్నారు. తమ అండతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ గానీ, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ గానీ తమను రాజకీయ పార్టీగా గుర్తించడానికి కూడా ఇష్టపడని రోజులున్నాయని, అలాంటి పార్టీలే ఇప్పుడు జనసేన తమతో కలిసి వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నాయని, ఇదే విజయానికి తొలిమెట్టని అన్నారు. వాళ్లకి తమ అవసరం ఉందేమోగానీ తమకు మాత్రం వాళ్ల అవసరం లేదని స్పష్టం చేశారు. రాజమండ్రి, అనంతపురం కవాతులు అఖండ విజయం సాధించడానికి ప్రజల్లో జనసేన పట్ల ఉన్న ప్రేమ, అభిమానాలే కారణమని ఆయన తెలిపారు.

శ్రీకాకుళం.. నెం.1

శ్రీకాకుళం/ రాజాం, జనవరి 5 (మనం న్యూస్‌బ్యూరో): శ్రీకాకుళం జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని, త్వరలో దీన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం రాజాం మండలం పొగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన 6వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ఇబ్బందులను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి, జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా చూసేందుకే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి రోజున ప్రజల సమస్యలను తెలుసుకోవడం, రెండో రోజు పథకాల అమలులో లోపాలను తెలుసుకోవడం, మూడోరోజు సంక్షేమ పథకాలపైన, ఈ రోజున రైతు సంక్షేమంపై కార్యక్రమాన్నినిర్వహిస్తున్నామని తెలిపారు. పేదలు, రైతుల కష్టాలను భుజస్కంధాలపై వేసుకుని వారి అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సంతృప్తే ధ్యేయంగా పని చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పెద్ద కొడుకుగా వృద్ధులకు పింఛన్లు, ఆహార భద్రత కింద సంక్రాంతి కానుకలు, క్రిస్టమస్ కానుకలు, రంజాన్ తోఫాలను అందిస్తూ నిరుపేదలు సైతం పండుగలను ఘనంగా నిర్వహించుకోవడానికి వీలు కల్పిస్తున్నామన్నారు. నిరుపేదలందరికీ సొంత గూడు కోసం.. రూ. 83 వేల కోట్లతో 30 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. 2004-2014 మధ్య చిన్నాభిన్నమైన వ్యవసాయరంగ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, వ్యవసాయ అనుబంధ రంగాలతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతులకు రూ.24 వేల కోట్లతో రుణమాఫీ చేశామన్నారు. సంక్రాంతి తర్వాత మిగిలిన రైతు రుణాలను సైతం మాఫీ చేస్తామని చెప్పారు. ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదైనా పంట దిగుబడి తగ్గకూడదని ఏపీఎంఐపి వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో వంశధార, నాగావళి నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టామని, తోటపల్లి పూర్తి చేశామని, వంశధార రెండోదశను జూన్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. అవసరమైతే గోదావరి నీటిని శ్రీకాకుళం జిల్లాకు తీసుకువస్తామని, నీటిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. క్రిమి సంహారక మందులు వాడకుండా ప్రకృతి సేద్యానికి శ్రీకారం చుట్టామని, ఇందుకు పారిస్‌లో అవార్డు కూడా తీసుకున్నామని తెలిపారు. 1.30 కోట్ల మందికి భూ ఆరోగ్య కార్డులు ఇచ్చామన్నారు. సూక్ష్మ పోషకాలు సరఫరా చేసి, భూసారాన్ని పెంచామన్నారు. వ్యవసాయానికి 9 గంటల కరెంటు అందిస్తామని, రైతుల కష్టాలను తొలగించి వారి ముఖాలలో ఆనందాన్ని చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పని చేయడానికి ప్రతి ఇంటికి స్మార్ట్ ఫోన్ ఇస్తామని, టోల్ ఫ్రీ నెం. 1100 కాల్ సెంటర్‌కు సమాచారం పంపించవచ్చునని, ప్రజాప్రతినిధులు, అధికారుల పనితీరుపై కూడా ఆర్టీజీఎస్ నుంచి సమాచారం తెలుసుకుంటున్నామని చెప్పారు. ఆధునిక పనిముట్లతో పని చేయడానికి కావలసిన శిక్షణను కూడా అందిస్తామన్నారు. ఉపాధి కార్యక్రమాలను అందిస్తున్నామని, ఆదరణలో ఉపాధి కార్యక్రమలు అందిస్తున్నామని చెప్పారు. ఆదరణ లో 64 శాతం, పింఛన్లలో 72 శాతం, తాగునీటి లో 49 శాతం, మధ్యాహ్న భోజనం 64 శాతం ప్రజా సంతృప్తి ఉందని, ఉపాధి హామీలో 43 శాతం సంతృప్తి వచ్చిందని చెప్పారు. కేంద్రం చేసిన జాప్యం కారణంగా వేతనం చెల్లించడంలో జాప్యం జరిగిందన్నారు. రుణమాఫీలో 57 శాతం సంతృప్తి వచ్చిందన్నారు. నిజాయితీతో పాలన అందించనున్నామని, 40 లక్షల ఎకరాలకు 37 లక్షల రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ అందించామన్నారు. రైతులకు మెరుగైన ఆదాయం వచ్చుటకు చర్యలు చేపట్టాలని, పండ్లతోటలు, హార్టికల్చర్ వైపు శ్రద్ధ వహించాలని రైతులకు తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తామని, ఏ పంట వలన ఆదాయం వస్తుందో సమాచారం ఇస్తామని అన్నారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని, గోకులాలలను నిర్మించాలని, పశువులకు కమ్యూనిటీ గోకులాలలను నిర్మించడం, పశువుల పేడను కంపోస్టుగా తయారుచేసి పొలాలకు మళ్ళించడం ద్వారా రైతులకు మంచి ఆదాయం వస్తుందని, సమయం ఆదా అవుతుందని చెప్పారు. శ్రీకాకుళం -పొందూరు రోడ్డు నిర్మాణం, తాగునీటి కుళాయిలు, రెండేళ్లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో రాజాం స్మార్ట్ సిటీగా అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు.

ఒంటరి పోరుకు రెడీ

లఖ్‌నవూ, జనవరి 5: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ మీద ఒంటరిగానే పోటీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి కలిసి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సూచనలు రావడంతో ఇక కాంగ్రెస్ పార్టీ తన కోడి.. కుంపటి తానే చూసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని పార్టీ సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు పీఎల్ పునియా తెలిపారు. కూటమి ముఖ్యం కానే కాదని.. తమ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని, ఇంతవరకు తాము కూటమి గురించి ఏ ఒక్కరితో మాట్లాడలేదని ఆయన అన్నారు. సమాజ్‌వాదీ, బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు అఖిలేశ్ యాదవ్, మాయావతి ఇద్దరూ ఢిల్లీలో కలిసి రాబోయే లోక్‌సభ ఎన్నికలలో సీట్ల పంపకం గురించి చర్చించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తీరుతో అసంతృప్తికి గురైన వీళ్లిద్దరూ.. ఉత్తరప్రదేశ్‌లో ఒక్కటై పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే అఖిలేశ్ యాదవ్ బాబాయ్, సమాజ్‌వాదీ పార్టీలో నెం.2 స్థానంలో ఉన్న రాంగోపాల్ యాదవ్ మాత్రం దీన్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీని తాము పక్కన పెట్టేశామన్న వ్యాఖ్యలన్నీ ఊహాగానాలేనని ఆయన స్పష్టం చేశారు. ఎందుకు ఇలా ఊహించుకుంటున్నారని విలేకరులను ఆయన అడిగారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కేబినెట్‌లో తమ పార్టీ తరపున ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేకు స్థానం కల్పించకపోవడంపై అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ మార్కు సాధించేందుకు తాము సాయం చేసినా కూడా ఆ పార్టీ మాత్రం తమ హామీని నిలబెట్టుకోలేదని ఆయన అన్నారు. 'కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు. వాళ్లు మా ఎమ్మెల్యేను మంత్రిగా చేయలేదు' అని అఖిలేశ్ గత వారం విలేకరులతో వ్యాఖ్యానించారు. ఇలా చేయడం ద్వారా ఉత్తరప్రదేశ్‌లో తమ మార్గమేంటో కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిందని ఆయన చెప్పారు. మరోవైపు మాయావతి కూడా కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల ముందు పొత్తుకు అవకాశాలు లేవంటూ కొట్టిపారేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీకి అధికార పీఠం దక్కకుండా ఉండేందుకు ఆగమేఘాల మీద ఆమె కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత వేరే అంశం గురించి మాట్లాడాల్సి వచ్చినపుడు తాము కాంగ్రెస్ పార్టీకి రెండు రాష్ట్రాల్లో మద్దతు ఇచ్చే విషయమై పునరాలోచించాల్సి వస్తుందని మాయావతి వ్యాఖ్యానించారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సవరణ అంశంపై దేశవ్యాప్త ఆందోళనలు జరిగినప్పుడు అమాయకులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునే అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు స్పందించకపోవడంతో ఆమె ఈ హెచ్చరిక చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా బీజేపీలా వ్యవహరించకూడదని.. వాళ్లు తమ హామీలు నిలబెట్టుకోలేదని అప్పట్లో చెప్పారు.

దాంతో కాంగ్రెస్ పార్టీకి యూపీలో మద్దతిచ్చే అంశంపై అటు అఖిలేశ్, ఇటు మాయావతి ఇద్దరూ వ్యతిరేకంగానే ఉన్నట్లు స్పష్టమైంది. పరిస్థితులన్నింటినీ గమనిస్తున్న బీజేపీ కూడా తన పావులు జాగ్రత్తగా కదుపుతోంది. ఏది ఏమైనా ఉత్తర ప్రదేశ్‌లో మాత్రం ప్రధాని నరేంద్రమోదీ ఒక్కరే మిగిలిన అన్ని పార్టీల నాయకులను ఎదుర్కోబోతున్నారని యూపీ బీజేపీ చీఫ్ మహేంద్రనాథ్ పాండే వ్యాఖ్యానించారు. అఖిలేశ్, మాయావతి పొత్తు పెట్టుకుంటే వాళ్లిష్టమని.. బీజేపీ పొత్తు మాత్రం దేశ ప్రజలతోనే ఉంటుందని ఆయన చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ కూటమి యూపీలో ఉన్న మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు గాను 73 చోట్ల గెలిచింది. కానీ గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఉప ఎన్నికలలో మాత్రం మాయావతి, అఖిలేశ్ పార్టీల చేతిలో ఓటమి చవిచూసింది. ఎస్పీ-బీఎస్పీ తమ మధ్య ఉన్న శతృత్వాన్ని పక్కన పెట్టి ఒక్కటిగా పోటీ చేశారు. యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీతో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకున్నా ఫలితాలు అత్యంత దారుణంగా వచ్చాయి. దాంతో ఇప్పుడు రాబోయే ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ పొత్తుతోనే సత్ఫలితాలు వస్తాయని భావిస్తూ.. వచ్చేవారం మరోసారి రెండు పార్టీల నేతలు కలిసే అవకాశ ఉంది.

జగన్ @ 3600

శ్రీకాకుళం, జనవరి 5: వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర మరో కీలక మైలురాయిని చేరుకుంది. దాదాపు ఏడాది నుంచి పాదయాత్ర చేస్తున్న ఆయన.. శనివారంతో 3,600 కిలోమీటర్ల యాత్ర పూర్తి చేసుకున్నారు. దీంతో రాష్ట్రంలో ఇంతవరకు ఏ నాయకుడూ నడవనంత దూరం ఆయన నడిచినట్లయింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీని ఎన్నుకుంటే ఏవేం చేస్తామో ప్రజలకు వివరిస్తూ.. వాళ్ల సమస్యలు వింటూ ఆయన తన పాదయాత్రను ఇన్నాళ్లుగా కొనసాగిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బారువ జంక్షన్ వద్ద జగన్ పాదయాత్ర 3600 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ఈ సందర్భంగా ఆయన ఈ మైలురాయికి గుర్తుగా వేప మొక్కను నాటి, అక్కడ పార్టీ జెండాను ఎగురవేశారు. శనివారం ఉదయం జగన్ సోంపేట మండలం తురకశాసనం నుంచి తన 337వరోజు పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి పాదయాత్ర పాలవలస, కొర్లాం మీదుగా బారువ కూడలి వరకు కొనసాగింది. అక్కడి నుంచి లక్కవరం వరకు పాదయాత్ర వెళ్లింది. ఈనెల 9వ తేదీన ఇచ్ఛాపురం చేరుకోవడంతో పాదయాత్ర ముగుస్తుంది.

వైఎస్‌ఆర్‌సీపీలోకి టీడీపీ..సీపీఎం నేతలు

వైఎస్ జగన్ సమక్షంలో మామిడిపల్లి, పలాస నియోజకవర్గ టీడీపీ, సీపీఎం నేతలు, కార్యకర్తలు వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జగన్ తమ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇన్నాళ్లుగా తాము చంద్రబాబును నమ్మి మోసపోయామని పార్టీలో చేరిన వారు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లలో జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో సాగుతున్న అరాచకాలకు అడ్డు లేకుండా పోయిందన్నారు. రేషన్‌కార్డులు, పింఛనుకు రూ. 1000, ఇల్లు కావాలంటే రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగికి ఇల్లు

సొంత ఇల్లులేని వారికి గృహవసతి.. జన్మభూమిలో తగ్గిన ఫిర్యాదులు

- ప్రజల భాగస్వామ్యం రెట్టింపు
- అర్హులకు సంక్షేమ పథకాలు: చంద్రబాబు
- జన్మభూమిపై సీఎం టెలికాన్ఫరెన్స్
- చుక్కల భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశం



అమరావతి, జనవరి 5: జీవన ప్రమాణాలు పెంచేందుకే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సొంత ఇల్లు లేని ప్రతి ఉద్యోగికి గృహ వసతి కల్పిస్తామని, ఉద్యోగుల సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సేవల ద్వారా ప్రజాసేవ చేసే ప్రతి ఉద్యోగికి సొంత ఇల్లు ఉండాలని అన్నారు. జన్మభూమి 4వ రోజు శనివారం కార్యక్రమంపై చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సారి జన్మభూమి కార్యక్రమంలో ఫిర్యాదుల సంఖ్య సగం తగ్గిందని చంద్రబాబు తెలిపారు. ప్రజల భాగస్వామ్యం రెట్టింపు అయ్యిందని, వైద్య శిబిరాలకు, వెటర్నరీ క్యాంపులకు స్పందన బాగుందని, ఇది చాలా సానుకూల పరిణామమని అన్నారు. నాలుగున్నరేళ్ల మన శ్రమ ఫలితం ఇదని అన్నారు. ప్రతి గ్రామంలో, వార్డులో అభివృద్ధి పనులు చేశామని, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఒకవైపు అభివృద్ధి పనులు కళ్ల ముందే ఉన్నాయని, మరోవైపు అర్హులు అందరికీ సంక్షేమం పథకాలు అమలు చేస్తున్నామని, ప్రజల్లో సంతృప్తే ఫిర్యాదుల సంఖ్య తగ్గడానికి కారణమని వెల్లడించారు. రేషన్, పెన్షన్, ఇళ్ల కోసం వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుల్లో అర్హులు అందరికీ న్యాయం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రగతికి రథాలు ప్రజలు, ఉద్యోగులేనని, ఇరువర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేకం చేశామని తెలిపారు. ఉద్యోగుల నేస్తం మన రాష్ట్ర ప్రభుత్వమని పేర్కొన్నారు. 30, 40 ఏళ్ల హైదరాబాద్‌తో అనుబంధం వదులుకుని ఉద్యోగులు, లాయర్లు ఇక్కడికి వచ్చారని, వారు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి భూములు గుర్తించాలని, అపార్ట్‌మెంట్లు నిర్మించి ప్లాట్లు కేటాయించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. రైతుల పండుగ సంక్రాంతి అని, పంట దిగుబడులు ఇంటికొచ్చే పర్వదినమని అన్నారు. సంక్రాంతి దినాల్లో జన్మభూమి పండుగలా జరపాలని సూచించారు. తీవ్ర ఆర్థిక లోటులో కూడా రైతులకు రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. ప్రతి రైతుకు రూ.లక్షా 50 వేల ప్రయోజనం కలిగిందని తెలిపారు. అలాగే రూ.4 వేల కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని, రూ. 4వేల కోట్ల విలువైన పంట ఉత్పత్తులు కొన్నామని వివరించారు. కౌలు రైతులకు రూ.9100 కోట్ల పంట రుణాలు ఇవ్వడం దేశంలోనే రికార్డు అని వెల్లడించారు. క్రాప్ హాలిడేస్, పవర్ హాలిడేస్ లేకుండా చేశామన్నారు. గతంలో ఎరువులు అడిగితే లాఠీచార్జిలు, పోలీస్ స్టేషన్లలో విత్తనాల పంపిణీ జరిగేదని, ఆ పరిస్థితులే లేకుండా చేశామని చెప్పారు. రైతులను అన్నివిధాలా ఆదుకున్నామని, శనివారం జరిగే గ్రామసభలో రైతు సంక్షేమంపై చర్చ జరపాలి అధికారులను ఆదేశించారు. పెట్టుబడి లేని వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. చుక్కల భూమి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. 64 ఏళ్లుగా రైతులను సతమతం చేస్తున్న సమస్య ఇదని, భూమిని బదిలీ చేసుకోలేక, అమ్ముకోలేక అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వమే సుమోటాగా తీసుకుని చుక్కల భూముల సమస్యలను పరిష్కరించి, రైతుల కళ్లల్లో ఆనందం చూడాలని చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.



పొగిరిలో చంద్రబాబు రోడ్ షో

(మనం న్యూస్ బ్యూరో, కాకుళం): శ్రీకాకుళం జిల్లా పొగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్ షో నిర్వహించారు. శనివారం రాజాం నియోజకవర్గం రాజాం మండలం పొగిరిలో నిర్వహించిన 6వ విడత జన్మభూమి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పొగిరిలో శివాలయం వీధి నుంచి చివర వరకు రోడ్ షో నిర్వహించి ప్రజలకు అభివాదం చేశారు. వివిధ సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన ప్రారంభించారు. ఇందులో ముందుగా పశు సంవర్థక శాఖ ఏర్పాటు చేసిన జర్సీ ఆవుల స్టాల్‌ను ప్రారంభించి.. అధికారులు ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలుచేస్తున్నది లేనిదీ, పథకాలపై సబ్సిడీ ఇస్తుందని లేనిదీ రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను సందర్శించి పంటలను ఏ విధంగా పండిస్తున్నది అడిగి తెలుసుకున్నారు. జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. తోటపల్లి, వంశధార జలాశయాలు గూర్చి జిల్లా కలెక్టర్ ముఖ్య మంత్రికి వివరించారు. మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. మత్స్యశాఖ, ఉద్యానవన శాఖ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి పథకాల గూర్చి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. కోలాటం, కర్రశాం, గంగిరెద్దుల విన్యాసాలు, యువత సంగిడీలు, తదితర వాటిని సందర్శించారు. అనంతరం ట్రాక్టర్‌పై కూర్చొని ప్రజలకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కిమిడి కళావెంకట్రావు, కింజరాపు అచ్చన్నాయుడు, జెడ్పీ చైర్ పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎంపీలు పూసపాటి అశోక్ గజపతిరాజు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, జిల్లా కలెక్టర్ కె. ధనంజయ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహనరావు, ఐటీడీఏ పీవో ఎల్. శివశంకర్, అధ్యక్షులు జడ్డు ఉషారాణి, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు రోడ్ షోలో ముఖ్యమంత్రి ఇళ్ల స్థల పట్టాలను పంపిణీ చేశారు.

కడపలో లోకేష్ పర్యటన

- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం
- రాయచోటి నియోజకవర్గంలో పథకాలు



కడప, జనవరి 5: కడప జిల్లాలో మంత్రి నారా లోకేశ్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం రాయచోటి నియోజకవర్గంలో లోకేష్ పర్యటించారు. రాయచోటి నియోజికవర్గంలోని వివిధ గ్రామాల్లో 24 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 19 కోట్ల వ్యయంతో రాయచోటిలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే 12 కోట్ల వ్యయంతో రాయచోటిలోని ప్రభుత్వ పాఠశాలలకు కాంపౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాయచోటి పర్యటనలో భాగంగా 75.78 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. కసిరెడ్డిగారిపల్లెలో ఆయనకు ప్రజలు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. 86 లక్షల వ్యయంతో నీలకంఠారావుపేట నుంచి రామాపురం వరకూ నిర్మించిన బీటీ రోడ్డుని ప్రారంభించారు. అలాగే కసిరెడ్డిగారిపల్లెలో 8 లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ గ్రామంలో 2 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇక రాయచోటి నియోజికవర్గం చిట్లూరు గ్రామంలో 85 లక్షల వ్యయంతో సీకే రోడ్డు నుంచి చెరువుముందరపల్లె వరకూ నిర్మించిన బీటీ రోడ్డును లోకేష్ ప్రారంభించారు. చిట్లూరు గ్రామం బీసీ కాలనీలో 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఈ గ్రామంలో 46 లక్షల వ్యయంతో ఏపీ మోడల్ స్కూల్‌లో కాంపౌండ్ వాల్, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాయచోటి నియోజికవర్గంలో అనంతపురం గ్రామంలో 46 లక్షల వ్యయంతో చెరువుముందర పల్లె నుంచి అనంతపురం పల్లె వరకూ నిర్మించిన బీటీ రోడ్డును లోకేష్ ప్రారంభించారు. అనంతపురం గ్రామంలో 3.54 లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇదే గ్రామంలో 21 లక్షల వ్యయంతో నిర్మించిన మినీ గోకులాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతపురం గ్రామంలో 7 లక్షల అంచనా వ్యయంతో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇదే గ్రామంలో ఎన్టీఆర్ గ్రామీణ గృహ కల్ప పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లక్కిరెడ్డి పల్లి, సోమాలవాండ్లపల్లె పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ఆర్థిక లోటున్నా అభివృద్ధి

నాలుగన్నరేళ్లుగా ఏపీ దూసుకుపోతోంది

- చంద్రబాబు పాలనలో ఎన్నో పథకాలు
- మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి: కోడెల

గుంటూరు, జనవరి 5: గుంటూరు జిల్లా నరసరావుపేటలో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు పాల్గొన్నారు. నరసరావుపేట పట్టణంలో 15, 16, 17 వార్డులలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. నరసరావుపేట మున్సిపల్ చైర్మన్ గుప్తా, కౌన్సిలర్లు ఆధ్వర్యంలో అద్భుతంగా అభివృద్ధి చెందిందని కోడెల అన్నారు. 2018 కంటే 2019లో నరసరావుపేట మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. నరసరావుపేట పట్టణంలో నాలుగేళ్లలో 517కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. పట్టణంలో ఎక్కడైన మంచినీటికి, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చేశామని వివరించారు. ఇళ్లులేని పేదలకు 2వేల పైగా కట్టించినట్టు తెలిపారు. నాలుగేన్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో అభివృద్ధి జరిగిందని కోడెల అన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షితతో అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్నామని వెల్లడించారు. 24 గంటల విద్యుత్, వెయ్యి రూపాయల పెన్షన్, రంజాన్, సంక్రాంతి కానుకలు, గ్యాస్, రేషన్, మరుగుదొడ్లు, శ్మశానవాటికలు, ఇళ్లు, రైతులకు రుణమాఫీ, వ్యవసాయ పరికరాలు ఇలా ఎన్నో చేశారని వివరించారు. ఒక్కరోజూ మీరు వేసిన ఓటుకు 18 వందల రోజులు అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యే ఎప్పుడైనా మీ దగ్గరకు వచ్చి సమస్యలు అడిగారా అని ప్రశ్నించారు. సత్తెనపల్లిలో గెలిచిన తనను ఈ స్థాయికి తెచ్చిన మీ కోసం నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజల్లోకి వచ్చి నిత్యం చేసినవి చెప్పడంతో పాటు చేయవలసిన అభివృద్ధి పనులు చెబుతున్నామని అన్నారు. ఆర్థిక లోటులో సైతం ఇంత అభివృద్ధి చేస్తున్న చంద్రబాబు మరోసారి గెలిస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందని కోడెల అన్నారు. రాబోయ్యే వందరోజులు అందరికీ కీలకమని, ఒక్కరోజూ మీరు వేసే ఓటు 18 వందల రోజులు మీకు ఉపయోగపడాలని కోడెల అన్నారు.

సెక్యూరిటీ లేకుండా..

- కర్నూలు జిల్లాలో అఖిల పర్యటన
- పోలీసులను వెంటరావదన్న మంత్రి
- అనుచరులను బెదిరిస్తున్నారని ఆగ్రహం

కర్నూలు, జనవరి 5: తనకు ఎలాంటి సెక్యూరిటీ అవసరం లేదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అఖిల ప్రియ అన్నారు. అంతేకాకుండా తనవెంట పోలీసులు ఎవరూ రావద్దని ఆదేశిస్తూ.. మావోయిస్టు ప్రభావిత నల్లమల అటవీ ప్రాంతంలోని గ్రామంలో ఆమె శనివారం జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా తన అనుచరుల ఇళ్లల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారన్న కోపంతో మంత్రి అఖిలప్రియ తనకు కేటాయించిన గన్‌మెన్‌లను వెనక్కి పంపారు. పోలీసుల తీరుపై అసంతృప్తిగా ఉన్న ఆమె తనకు రక్షణగా వస్తున్న స్థానిక పోలీసులను సైతం వెంట రావద్దని సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం మంత్రి అఖిలప్రియ రుద్రవరం మండలం టి లింగందిన్నె గ్రామంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. తన వెంట పోలీసులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిని తిరిగి పంపించివేశారు. ఈ సందర్భంగా అఖిలప్రియ మాట్లాడుతూ.. కార్డన్ సెర్చ్ పేరుతో పోలీసులు తన అనుచరులను బెదిరిస్తున్నారని, తన అనుచరులను కాపాడుకునేందుకు ఎంత దూరమైనా వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. తన కార్యకర్తలకు లేని రక్షణ తనకు కూడా అవసరం లేదని అన్నారు.



ప్రజల సంక్షేమం కోసమే ప్రజాకూటమి

- ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు సురేష్

విజయవాడ, జనవరి 5, మనం న్యూస్: ప్రజల కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలన్నీ ప్రజాశాంతి పార్టీకి మద్దతు తెలుపుతున్నట్టు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేదర సురేష్‌కుమార్ తెలిపారు. తాము రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో పోటీ చేస్తామన్నారు. గత పాలకులతో పాటు ప్రస్తుత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైనందునే ప్రజాశాంతి పార్టీకి మద్దతు తెలియజేస్తున్నట్లు సురేష్ అన్నారు. శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, వివిధ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బహుజనులు రాజ్యాధికారం సాధించే దిశగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు ప్రజాశాంతి పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రస్తుత రాజకీయ పార్టీలన్నీ అవినీతిలో కూరుకుపోయినందుకే ప్రజాశాంతి పార్టీకి మద్దతిస్తున్నట్టు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్ అన్నారు. ఈ నెల 12న కేఏ పాల్ సమక్షంలో విజయవాడలో ప్రజా సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఒకే వేదికపై రావటం సంతోషమని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు నమ్మి అప్పారావు అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

నేడు కేబుల్ ప్రసారాలకు బ్రేక్

విజయవాడ, జనవరి 5: కేబుల్ ఆపరేటర్లు, ఎంఎస్‌ఓలపై కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరుషపదజాలంతో దూషించారని, ఇందుకు నిరసనగా ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ రాష్ట్ర వ్యాప్తంగా కేబుల్ ప్రసారాలు నిలిపివేస్తున్నామని ఏపీ మల్టీ సిస్టమ్ ఆపరేటర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి సాయిబాబు తెలిపారు. బాధ్యతాయుత పదవిలో ఉండి విజయ్ కృష్ణన్ అటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేబుల్ ప్రసారాల నిలిపివేయడం పట్ల ప్రేక్షకులు సహకరించాలని కోరారు. గుంటూరు సిటీ కేబుల్ ఎండీ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. 30 ఏళ్ల సర్వీస్‌లో ఏ అధికారి కూడా కేబుల్ అపరేటర్లను ఇలా దూషించలేదన్నారు. తాము చట్టబద్ధంగానే బిజినెస్ చేస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఏపీ కేబుల్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విజయ్ కృష్ణన్ టెక్నికల్ నాలెడ్జ్ లేకుండా కేబుల్ ఆపరేటర్లను, ఎంఎస్‌ఓలను దూషించారని అన్నారు. జేసీ విజయ్ కృష్ణన్ తన వ్యాఖ్యలను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- వాటిలో 50 శాతం అదనంగా చార్జీలు
- ఏపీ, తెలంగాణకు టీఎస్ ఆర్టీసీ ఏర్పాట్లు

హైదరాబాద్, జనవరి 5: సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇప్పటికే 300 బస్సులు ఫుల్ అయ్యాయి. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మొత్తం 5252 బస్సులు సిద్ధం చేశారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ నుంచి 3400 బస్సులు తిరుగుతాయి. కర్నూలు అనంతపురం వెళ్లే రెగ్యులర్ బస్సులు ఎంజీబీఎస్ నుంచి, స్పెషల్ బస్సులు సీబీఎస్ నుంచి బయలుదేరుతాయి. వికారాబాద్, తిరుపతి, మహబూబ్ నగర్, బెంగుళూరు బస్సులు ఎంజీబీఎస్ నుంచి వెళ్తాయి. విజయవాడ వైపు వెళ్లే బస్సులు నగర శివార్ల నుంచి బయలుదేరుతాయి. ఉత్తర తెలంగాణ బస్సులు 10వ తేదీ నుంచి 14వరకు జేబీఎస్ నుంచి నడుస్తాయి. నల్లగొండ వెళ్లే బస్సులు దిల్‌షుఖ్‌నగర్ నుంచి, వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి వెళ్తాయి. వెయ్యి బస్సులలో సీట్లను ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే వెసులు బాటు కల్పించారు. ప్రయాణికుల సేవల కోసం 24 గంటలూ అధికారులు అందుబాటులో ఉంటారు. స్పెషల్ బస్సులకు స్పెషల్ చార్జీలు ఉంటాయి. 50 శాతం అదనంగా చార్జీలు ఉంటాయి. రిజర్వేషన్లలో విశాఖ, అమలాపురం, రాజోలు వంటి ప్రాంతాలకు డిమాండ్ అధికంగా ఉంది. 1592 బస్సులను తెలంగాణకు, 3670 బస్సులను ఏపీకి నడపనున్నారు. సిటీ బస్సులను కూడా వినియోగిస్తాం. రోజుకు 400 మెట్రో ఎక్స్‌ప్రెస్, లైనర్లు, డీలక్స్ బస్సులను వాడుతారు.



కన్నా ఇంటి ముందు టీడీపీ కార్యకర్తల ఆందోళన



గుంటూరు, జనవరి 5: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటి ఎదుట టీడీపీ కార్యకర్తలు శనివారం ఆందోళనకు దిగారు. కాకినాడలో సీఎం చంద్రబాబు నాయుడును బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కన్నా ఇంటి ముందు ధర్నాకు దిగారు. ప్రధాని నరేంద్ర మోదీ, కన్నా, బీజేపీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీడీపీ ఆందోళనకారుల ఎదుటే కన్నా కూర్చోగా.. ఆయనకు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో టీడీపీ- బీజేపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వివాదం చేటుచేసుకుంది. అనంతరం తోపులాట చేసుకోవడంతో టీడీపీ కార్యకర్తలను పోలీసులు అక్కడి నుంచి తీసుకువెళ్లారు. తన ఇంటి ముందు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ధర్నా చేయడాన్ని కన్నా లక్ష్మీనారాయణ ఖండించారు. తనను అంతమొందించేందుకే తెలుగుదేశం కార్యకర్తలు వచ్చారంటూ ఆరోపించారు. గుంటూరులో టీడీపీ, బీజేపనీ కార్యకర్తల ఘర్షణ అనంతరం కన్నా లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. శుక్రవారం కాకినాడలో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన బీజేపీ కార్యకర్తల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమర్యాదకరంగా వ్యవహరించారని కన్నా ఆరోపించారు. బీజేపనీ మహిళా కార్పొరేటర్‌ను ఫినిష్ చేస్తామని సీఎం హెచ్చరించడాన్ని ఆక్షేపించారు. చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా బీజేపీ కార్యకర్తలను అరెస్టులు చేయిస్తున్నారని, ఏపీలో అరాచక పాలన నడుస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై కేంద్ర హోం మంత్రికి, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని కన్నా చెప్పారు.

ఏపీలో పొత్తుల చిత్రంలో ఎన్నెన్ని చిత్రాలో...

కాంగ్రెస్ – తెలుగుదేశం పార్టీల మధ్య ఏర్పడిన తెలంగాణ బంధం ఇలాగే కొనసాగుతుందా? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంగా ఏర్పడిన ప్రజకూటమి రేపటి లోక్‌సభ ఎన్నికల దాకా నిలబడుతుందా? జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటుకు నడుం బిగించిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వప్నం నెరవేరుతుందా? తెలంగాణ అనుభవం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో పొత్తు కొనసాగించే విషయంలో కాంగ్రెస్ నాయకత్వం పునరాలోచనలో పడిందా? – అన్ని ప్రశ్నలకు అవును, కాదన్న సమాధానాలే వినిస్తున్నాయి. అయితే, ఇప్పటికే ఓ వంక తెలంగాణలో తెలుగుదేశంతో పొత్తు కారణంగానే కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించింది అన్న అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో బలంగా ఏర్పడింది. మరో వంక ఏపీలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు తెలుగుదేశానికి అనివార్యంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ కాదంటే, జనసేనతో అయినా పోదామని చంద్రబాబు వేసిన పాచిక పారలేదు. జనసేన అధినేత వామపక్షాలతో కలిసి ఒంటరిగా పోటీ చేస్తామని స్పష్టంగా ప్రకటించారు. మరో వంక కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఒంటరిగా అయినా పోటీ చేసేందుకు సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర నాయకులకు సూచించారు. మరో వంక ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడు వైసీపీతో పొత్తుకు సైతం సిద్ధమన్న సంకేతాలు ఇచ్చారు. సో ..ఏపీలో పొత్తుల చిత్రం చివరకు ఏ రంగులు అద్దుకుంటుందో... ఎన్నెన్ని చిత్రాలను చూపిస్తుందో... వేచి చూడవలసిందే.


'అవునా... నిజమా తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీతో జట్టు కడుతోందా'... మూడు, నాలుగు నెలల క్రితం తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నోటి నుంచి కాంగ్రెస్'తో పొత్తు ప్రతిపాదన వచ్చినప్పుడు చాలా మంది ఇలానే ఆశ్చర్యపోయారు. జరగరానిది ఏదో జరిగిపోతున్నట్లు బోలెడంత ఆశ్చర్యపోయారు. నిజానికి తెలుగుదేశం నాయకులే అది నిజం అని నమ్మలేదు. చాలా మంది తమ్ముళ్ళు అది నిజం కారాదని కోరుకున్నారు. కేఈ కృష్ణ మూర్తి, చింతకాయల అయ్యన్న పాత్రుడులాంటి ఒకరిద్దరు మంత్రులు అయితే, అదే జరిగితే టీడీపీ భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని, అది టీడీపీకి ఆత్మహత్యా సదృశ్యమవుతుందని వాపోయారు. అయినా, పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, బీజేపీని ఓడించే 'పవిత్ర లక్ష్య' సాధనలో భాగంగా కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టాలని నిర్ణయించారు. అందుకు ఆయన చెప్పిన కారణం రాహుల్ గాంధీ ప్రధాని అయితే, రాష్ట్రానికి ప్రత్యేక హోదాను బంగారు పళ్ళెంలో పెట్టి ఇస్తానని, తొలి సంతకం 'హోదా పత్రం' మీదనే పెడతానని హామీ' ఇచ్చారని... అందుకే రాష్ట్ర ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపామని చెప్పుకున్నారు. అది నిజం కాదని ఆయనకు తెలుసు మనకు తెలుసు కాబట్టి ఆ విషయాన్ని అలా ఉంచి విషయంలోకి వస్తే ..

కాంగ్రెస్ టీడీపీ కలయిక సామాన్య ప్రజలు, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలకే కాదు, కాంగ్రెస్ నాయకులను కూడా విస్మయానికి గురిచేసింది. చంద్రబాబు నాయుడు స్వయంగా వెళ్లి రాహుల్ గాంధీని కలవడం తను నమ్మలేక పోయానని, తనను విస్మయానికి గురిచేసిందని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. ఆ షాక్ నుంచి బయటపడేందుకు 24 గంటలు పట్టిందని రఘువీరా స్వయంగా పేర్కొన్నారు. ఆయన పరిస్థితే అలా ఉంటే, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంతటి విస్మయానికి గురయ్యారో చెప్పనక్కర లేదు.

ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా ఆ ఇద్దరు (రాహుల్ – బాబు) ఇష్టపడ్డారు, కలిసిపోయారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీతో పాటుగా టీజేఎస్, సీపీఐ కలిసి ప్రజాకూటమిగా ఏర్పడి పోటీచేశాయి. ఫలితం ఏమైందో వేరే చెప్పనక్కరలేదు. కూటమి ఓడిపోయింది. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమే అయినా తెలంగాణలో ప్రజా కూటమి ఓటమి కొంచం చాలా ప్రత్యేకం. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుస్తుందని అందరూ ముందునుంచే ఊహించారు. అయితే, చంద్రబాబు నాయుడు సర్వం తానై కూటమి భారాన్ని భుజానికి ఎత్తుకుని పడిన శ్రమచూసిన తర్వాత ప్రజకూటమి మరీ ఇంత ఘోరంగా ఓడిపోతుందని ఎవరూ అనుకుని ఉండరు. కానీ, చివరకు ఆయన శ్రమే... కారు జోరును పెంచింది... కాంగ్రెస్ కూటమిని చిత్తు చేసిందని ఇప్పుడు అందరూ ఒక విధమైన ఏకాభిప్రాయానికి వచ్చారు.

'సక్సెస్ హాజ్ మెనీ ఫాదర్స్, ఫెయిల్యూర్ ఈజ్ యాన్ ఆర్ఫాన్' అంటారు అంటే, 'విజయానికి అందరూ తండ్రులే, ఓటమి ఓ అనాథ'. ఇప్పుడు కూటమి ఓటమిని సొంతం చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు, పైగా కూటమిలో చేరి తప్పుచేశామని చెంప లేసుకుంటున్నారు. తెలంగాణలో ప్రజకూటమి గెలిచుంటే అటు కాంగ్రెస్, ఇటు తెలుగు దేశం నాయకులు సంబరాలు చేసుకుని సంతోషించే వారేమో, కానీ, కూటమిని ఓటమి వరించింది. ఆ ఓటమికి బాధ్యత వహించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. అంతే కాదు, టీడీపీతో పొత్తు వల్లనే ఘోర పరాజయం పాలయ్యామని కాంగ్రెస్, కాదు కాంగ్రెస్ పార్టీతో పొత్తు కారణంగా, పార్టీ గుర్తింపును కోల్పోయే ప్రమాదంలో పడిపోయామని టీడీపీ నాయకులు ఓటమిని అవతలి పక్షం పైకి నెట్టేసే ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఇక్కడ విషయం ఏమంటే తెలంగాణలో ఎదురైన చేదు అనుభవ ప్రభావం ఒక్క ఆ రాష్ట్రానికే పరిమితం కాలేదు. నిజానికి తెలంగాణలో కంటే ఏపీలోనే ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలపై ఎలా అయితే ప్రభావం చూపుతాయని అనుకున్నామో, అలాగే, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్‌సభ ఎన్నికలతో పాటు జరిగే ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపుతాయని ముందు నుంచి అనుకున్నదే. ఇటీవల ఇటు కాంగ్రెస్ పార్టీలో అటు టీడీపీ,



సీపీఐ, టీజేఎస్ నేతల స్వరాల్లో వస్తున్న మార్పును బట్టి చూస్తే ఇప్పుడు అదే జరుగుతోందనిపిస్తోందని రాజకీయ వర్గాలలో చర్చ మొదలైంది.

తెలంగాణలో ఊహించని ఘోర పరాజయం అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులలో అంతర్మథనం మొదలైంది. తెలుగుదేశం పార్టీ పొత్తు కొంప ముంచిందని, పొత్తు కారణంగానే పరాజయంతో పాటు పరాభవం తోడైందని, కాంగ్రెస్ సీనియర్లు కొందరు మాటల సందర్భంలో మనసులోని మాటను బయట పెడుతున్నారు. అలాగే, టీడీపీతో పొత్తు కొనసాగితే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందన్న అభిప్రాయం కాంగ్రెస్ నేతలు వ్యక్తపరుస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ పొత్తు కొనసాగితే, అసలు పోటీచేయక పోవడమే మంచిదని సీనియర్లు కొందరు అంటున్నారు. టీడీపీతో పొత్తు లేకుంటే కాంగ్రెస్ కూటమికి కనీసం మరో 15 – 20 స్థానాలు దక్కేవని పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. పార్టీలోని యువబృందం ఈ లెక్కలను సిద్ధం చేస్తోంది. పొత్తు రద్దు కోరుతూ కాంగ్రెస్ అధిష్టానానికి త్వరలోనే ఒక నివేదిక పంపుతామని ఒక యువనేత తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని సమీక్షించుకుంటున్న టీపీసీసీ ముఖ్యులు కూడా టీడీపీతో పొత్తు తమ పుట్టి ముంచిందనే నిర్ధారణకు వస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలకంటే టీడీపీ అధినేత హోదాలో చంద్రబాబు ఈ ఎన్నికలను హైజాక్ చేయడం వల్లే ప్రజల్లో తమ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని భావిస్తున్నారు. చంద్రబాబు ఎంట్రీతో అంతవరకు కాంగ్రెస్ పట్ల కొంత సానుభూతితో ఉన్న తెలంగాణ ప్రజలు (చివరకు సీమాంధ్ర ప్రజలు కూడా) టీఆర్ఎస్ వైపు మొగ్గుచూపారని కాంగ్రెస్ నాయకులు ఒక నిర్ణయానికి వచ్చారు. తెలంగాణ ప్రజల్లోనే కాకుండా హైదరాబాదులో స్థిరపడిన సీమాంధ్ర ప్రజల్లోనూ చంద్రబాబు పట్లగల వ్యతి రేకతను కేసీఆర్ తమకు అనుకూలంగా మలచుకున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు 'స్వగతం'లో చింతిస్తున్నారు.

అందుకే, లోక్‌సభ ఎన్నికల నాటికి ప్రజా కూటమి ఉంటుందా, కనీసం కాంగ్రెస్, టీడీపీ అయినా కలిసి పోటీ చేస్తాయా అన్న సందేహాలు రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమకుమార్ రెడ్డి కూడా, లోక్‌సభ ఎన్నికల పొత్తుల గురించి పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని అంటున్నారే గానీ, ఓడినా ప్రజా కూటమి సజీవంగా ఉంటుందని మాత్రం అనడంలేదు. కర్ణాటకలో కాంగ్రెస్, జేడీఎస్ మధ్య సయోధ్యత అంతగా లేదు. కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలలో అసంతృప్తి చాలా బలంగా ఉంది. అయినా కాంగ్రెస్ నాయకులు ఆ రాష్ట్రంలో జేడీఎస్‌తో పొత్తు ఉంటుందని, లోక్‌సభ ఎన్నికలను కలసే ఎదుర్కొంటామని చాలా ధీమాగా చెపుతున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో అలాంటి ధోరణి, ధీమా కనిపించడం లేదు.

నిజానికి, జాతీయ స్థాయి పొత్తులు, బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేసేందుకు చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రయత్నాల కారణంగా టీడీపీ పొత్తు అనివార్యం అయినా తెలంగాణ వరకు మినహాయింపు ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అధిష్టానాన్ని కోరుతున్నారు. 'మంచో చెడో ఓసారి పొత్తు పెట్టుకున్నాం. దాని పర్యవసానాలు అనుభవించాం. ఇకనైనా తెలంగాణ ప్రజల మనసెరిగి వ్యవహరిస్తే బాగుంటుంది' అని టీపీసీసీ సీనియర్ నేత, మాజీ మంత్రి రవీంద్ర నాయక్ అన్నారు.

అలాగే, సీపీఐ, టీజేఎస్ నాయకులు కూడా చేసిన తప్పు మరోసారి చేయరాదన్న అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో అనేకమంది నాయకులు వామపక్షాల ఉనికిని కాపాడుకునేందుకు సీపీఎం, ఇతర లౌకికవాద శక్తులతో కలిసి పనిచేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండ రామ్ అయితే, మరో అడుగు ముందుకు వేసి, ఓటమికి ఈవీఎంల ట్యాంపరింగ్ కారణం కాదని, అలాని అనుకోవడం ఆత్మవంచన అవుతుందని అన్నారు. ఇలా మొత్తంగా చూస్తే, ఎన్నికల ముందు ఆర్భాటంగా తెరపైకి వచ్చిన ప్రజా కూటమి కథ తెలంగాణలో ముగిసినట్లే అనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణలో పరిస్థితి ఇలాఉంటే, ఏపీలోనూ ఇంచుమించిగా ఇదే పరిస్థితి. రానున్న లోక్‌సభ, రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ ఒంటరిగా పోటీ చేయాలా లేక ఏదైనా పార్టీతో పొత్తు పెట్టుకోవాలా అనే విషయంలో కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షుడు రఘువీరా రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర బాధ్యుడు ఊమెన్ చాందీ ఇతర నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రఘువీరా రెడ్డి, రాష్ట్రంలో ఒంటరిగానైనా, పొత్తులతో అయినా పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని రాహుల్ గాంధీకి వివరించారు. అంతేకాదు, రాహుల్ గాంధీ కూడా ఒంటరిగా పోటీ చేయడానికి అయినా సిద్ధంగా ఉండాలని రఘువీరాకు సూచించారు. అంటే ఏపీ లోనూ టీడీపీతో పొత్తు విషయంలో కాంగ్రెస్ పార్టీ పునరాలోచనలో పడిందని అనుకోవచ్చు. రాహుల్ గాంధీతో సమావేశం అనంతరం రఘువీరా రెడ్డి కొంచెం నర్మగర్భంగానే అయినా వైసీపీతో పొత్తుకు కూడా కాంగ్రెస్ తలుపులు తెరిచే ఉన్నాయన్న సంకేతాలను ఇచ్చారు. 'కాంగ్రెస్ పార్టీతో ఎవరు పొత్తు పెట్టుకుంటే వారు నక్కను తొక్కినట్లే' నని వారే అధికారంలోకి వస్తారని అన్నారు. అలాగే, రాష్ట్రంలో ఏ ఒక్క పార్టీకీ (అంటే టీడీపీ, వైసీపీలకు) ప్రభుత్వం ఏర్పాటు చేసే సంఖ్యాబలం రాదని రఘువీరా అన్నారు. అలాగే, పొత్తుల విషయంలో తమ పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని అయన పేర్కొన్నారు. అంటే, కాంగ్రెస్ పార్టీతో పొత్తు తమకు అనివార్యం కాదని, తెలుగుదేశం పార్టీకే తమతో పొత్తు అనివార్యమని చెప్పకనే చెప్పారు. నిజమే, బహుశా తెలుగుదేశంతో సీట్ల బేరసారాలకు రఘువీరా పునాదులు ఏర్పాటు చేసుకున్నారని అనుకోవచ్చు. ఏదిఏమైనా, కాంగ్రెస్ పార్టీతో పొత్తు తెలుగుదేశానికి అవసరం, అనివార్యం. మరోవంక , తెలంగాణ అనుభవంతో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశంతో పొత్తుకు మంగళం పాడేస్తుందేమో అన్న అనుమానం టీడీపీ నాయకుల్లో మొదలైన సంకేతాలు కనిపిస్తున్నాయి. అందుకే కావచ్చు, తెలుగుదేశం, పవన్ కల్యాణ్ పార్టీ జనసేనతో పొత్తు పెట్టుకుంటే తప్పేంటని చంద్రబాబు స్వయంగా పేర్కొన్నారు. అయితే, ఈ ప్రతిపాదనపై ఒకటి రెండురోజులు మౌనంగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికార(టీడీపీ), ప్రతిపక్షాలు (వైసీపీ) వేటితోనూ పొత్తు ఉందని, వామపక్షాలతో కలిసి మొత్తం స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రఘువీరారెడ్డి పేర్కొన్నట్లు కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీచేయడం తెలుగుదేశం పార్టీకి అనివార్యం అనేది స్పష్టంగానే కనిపిస్తోంది. మరోవంక కాంగ్రెస్ నుంచి విడిపోయి సొంత కుంపట్లు పెట్టుకున్న శరత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ, మమత బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ లాంటి పార్టీలతో పొత్తుపెట్టుకున్న అనుభవం కాంగ్రెస్ పార్టీకి ఉంది. నిజానికి, ఏ పార్టీ అయినా స్వప్రయోజనాలను ఆశించే మరో పార్టీతో పొత్తుకు పెట్టుకుంటుంది. ఆ కోణంలో చూసినప్పుడు ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశంతో పొత్తువలన ప్రయోజనం లేదని భావిస్తే మరోపార్టీతో పొత్తు పెట్టుకోవడమో లేదంటే ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీతో ఒంటరిగా పోటీచేసి అదృష్టాన్ని పరీక్షించుకోవడమో చేస్తుంది. మొత్తంగా చూస్తే తెలుగు దేశం, చంద్రబాబు పరిస్థితి కొంత అగమ్య గోచరంగా మారినట్లుగానే కనిపిస్తోంది.

రాజనాల బాలకృష్ణ
9985229722

> **జనసేన అధినేత పవన్ క ల్యాణ్ అధికార(టీడీపీ), ప్రతిపక్షాలు (వైసీపీ) వేటితోనూ పొత్తు ఉందని, వామపక్షాలతో కలిసి మొత్తం స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రఘువీరారెడ్డి పేర్కొన్నట్లు కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీచేయడం తెలుగుదేశం పార్టీకి అనివార్యం అనేది స్పష్టంగానే కనిపిస్తోంది. మరోవంక కాంగ్రెస్ నుంచి విడిపోయి సొంత కుంపట్లు పెట్టుకున్న శరత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ, మమత బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ లాంటి పార్టీలతో పొత్తుపెట్టుకున్న అనుభవం కాంగ్రెస్ పార్టీకి ఉంది. నిజానికి, ఏ పార్టీ అయినా స్వప్రయోజనాలను ఆశించే మరోపార్టీతో పొత్తుకు పెట్టుకుంటుంది. ఆ కోణంలో చూసినప్పుడు ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశంతో పొత్తువలన ప్రయోజనం లేదని భావిస్తే మరోపార్టీతో పొత్తు పెట్టుకోవడమో లేదంటే ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీతో ఒంటరిగా పోటీచేసి అదృష్టాన్ని పరీక్షించుకోవడమో చేస్తుంది.**

ప్రశ్నించేవారిని ఎన్నుకోండి

ఓటర్లారా ఆలోచించండి. ఎవరికి బడితే వారికి ఓటు వేసి మీరు ఓడిపోవద్దు. తెల్లారి లేచింది మొదలు రాజకీయాలు భ్రష్టుపోయాయని, అవినీతి, కులతత్వం పెరిగిపోయిందని అందరూ తెగ విమర్శించేస్తుంటారు. ఎవరికి వారు తమని పట్టించుకోవడంలేదని, తమ సమస్యలు పరిష్కరించడంలేదని, ఎన్నికలప్పుడే తాము గుర్తుకు వస్తుంటామని, కుక్కకు బిస్కెట్లు వేసినట్లు చిన్నా చితక పథకాలతో తమని మోసం చేస్తుంటారని రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, పేదలు అందరూ గగ్గోలు పెడుతుంటారు. ప్రభుత్వ విధానాలను విమర్శించేవారిలో అత్యధిక మందికి ఎన్నికలప్పుడు ఓటు వేయడానికి బద్ధకించేవారే. ఓటు వేసేవారైనా నిజాయితీగా ఓటు వేస్తారా అంటే అలా వేయరు. ప్రస్తుత రాజకీయాలలో ఏ పార్టీలోనైనా నిజాయితీపరులు, సమర్థులు, సామాజిక న్యాయాన్ని కోరుకునేవారు అతి తక్కువ. ఒకవేళ అటువంటి మంచి వ్యక్తి ఏదైనా పార్టీ తరపున గానీ, స్వతంత్రంగా గానీ పోటీ చేసినా వారికి ఓటు వేయరు. అత్యధిక మంది కులం చూసి ఓటు వేస్తారు. తమకులం వాడైతే చాలు రౌడీ షీటర్ అయినా, ఆడపిల్లలను వేధించేవాడైనా, అవినీతిపరుడు, దోపిడీదారుడైనా ఓటు వేసేస్తారు. గెలిపిస్తారు. కొందరు పోటీ చేసేవారు ఎవరైనా, ఎటువంటివారైనా డబ్బు ఇచ్చి, మందు పోయిస్తే ఓటు వేస్తారు. ఇంకొందరు చిన్నచిన్న బహుమానాలకు అమ్ముడుపోతారు. మరి కొందరు సినిమా హీరో అయితే చాలు గెలిపిస్తారు. ఈ విధంగా ఓటువేస్తే ఉత్తమ నేతలు ఎలా ఎన్నికవుతారు? మంచి పాలన కావాలంటే ఎలా సాధ్యమవుతుంది? మనం ఓటు ఎలా, ఎవరికి వేశామో అలాంటి నాయకులే ఎన్నికవుతారు. 5 సంవత్సరాలు మనల్ని పాలిస్తారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలను ఎదగనివ్వరు. దోపిడీ చేస్తారు. మనపై ఎక్కి తొక్కుతారు. కొద్దోగొప్పో కాస్త నిజాయితీగా ఉండి, సమసమాజ దృక్పథంతో ఉన్న కమ్యూనిస్టులకు ఓటు వేయరు. వారిలో కూడా రానురాను పోరాట పటిమ తగ్గుతోంది. వారి ఆలోచనలలో కూడా మార్పులు వచ్చాయి. వారి పట్ల ప్రజలు సానుకూలంగా లేరు.

మంచి వ్యక్తులు రాజకీయాలలోకి రావడానికే జంకుతున్నారు. రాకరాక ఎవరైనా మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తే వారికీ జనం ఓట్లు వేయరు. కులం ముఖ్యమైపోయింది. సమర్థులు, కాస్త ప్రభుత్వాన్ని నిలదీయగలిగినవారు పోటీచేసినా వారిని కూడా కులం దృష్టితోనే చూస్తారు. చివరికి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రధానమైన సమస్యలను ప్రస్తావించేవారు లేరు. విషయ పరిజ్ఞానం కలిగినవారు లేరు. ప్రభుత్వాన్ని నిలదీసేవారు లేరు. ప్రశ్నించడానికి కమ్యూనిస్టులు గానీ, కాంగ్రెస్ పార్టీ వారుగానీ, సమర్థులైన స్వతంత్ర సభ్యులుగానీ లేరు. అంత దయనీయంగా ఉన్నాయి రాష్ట్ర రాజకీయాలు. నిజాయితీపరులు, విషయ పరిజ్ఞానం కలిగి ప్రశ్నించగల సత్తా ఉన్న డాక్టర్ నాగభైరవ జయప్రకాష్ నారాయణ వంటి వారిని కూడా కులం దృష్టితో చూస్తారు. ఇలాంటి వారు వేరువేరు దృక్పథాలు కలిగిన వారైనప్పటికీ సామాజిక స్పృహ ఉన్నవారు. ప్రశ్నించే దమ్ము ధైర్యం ఉన్నవారు. కత్తి పద్మారావు దేశంలో చారిత్రకంగా సామాజిక పరిణామ క్రమాన్ని ఆమూలాగ్రం అధ్యయనం చేసిన సామాజిక శాస్త్రవేత్త. బాధితుల కులం ఏదైనా వారి పక్షాన నిలిచి పోరాటాలు చేసిన దిట్ట. బుద్ధిజం, మార్క్సిజం, అంబేద్కర్ భావజాలం వంటబట్టించుకున్న వ్యక్తి. అటువంటి వ్యక్తి ఎన్నికలలో పోటీచేస్తే ఓడిస్తారు. మరో గొప్ప వ్యక్తి డాక్టర్ జయప్రకాష్ నారాయణ. ఐఏఎస్ అధికారిగా ఆయన అనేక పదవులు సమర్థవంతంగా నిర్వహించారు. సామాజిక స్పృహ ఉన్న వ్యక్తి. నేటి రాజకీయ వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతూ ప్రజలలో, ముఖ్యంగా యువతలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారు. నిజాయితీపరుడు. ఆయన రాజకీయాల్లోకి వస్తే తిప్పికొట్టారు. ఎంపీగా పోటీచేస్తే ఓడించారు. ఇటువంటి నేతలు రాజకీయాల్లోకి రావడమే అరుదు. వచ్చినవారిని కూడా నిరాకరిస్తే ఎలా? ఇటువంటి వారిని ప్రోత్సహించకుండా అవినీతిలేని రాజకీయాలు, పరిపాలన కావాలంటే ఎలా వస్తుంది? ఇటువంటి వారు ఏ పార్టీలో ఉన్నా, వారు ఏ కులమైనా ఓటు వేసి గెలిపించిననాడు రాజకీయాలలో, పాలనలో మార్పులు వస్తాయి. అటువంటి వారు శాసనసభలో కనీసం పది మందైనా ఉంటే అవినీతి అడ్డుకోగలుగుతారు.

ప్రభుత్వాన్ని అదుపులో పెట్టగలుగుతారు. ఆనాడే మార్పుకు అవకాశం ఉంటుంది. శాసనసభలో ఇటువంటి పది మంది ఉంటే పాలన ఎలా ఉంటుందో, సమావేశాలు ఎలా జరుగుతాయో ఒక్కసారి ఆలోచించండి. ఇటు వంటి వారు ఎన్నికలలో పోటీచేస్తే వారికి ఓటు వేయకపోతే ఓడిపోయేది వారు కాదు, ఓటర్లే? అటువంటి వారు రాజకీయాల్లోకి వచ్చి, ప్రజలను చైతన్యవంతం చేయవలసిన అవసరం ఉంది. ఎన్నికలలో ఓడిపోయినా ఓటమి గెలుపుకు నాందిగా భావించాలి.

యువకెరటం

మహా ప్రస్థానం

పుట్టిన ప్రాణి గిట్టక మానదని
తెలిసిన
నిజాన్ని జీర్ణించుకోలేక.. బ్రతుకు
మీద ఆశను చంపుకోలేక తుది
గడియలో ఆరాటానికి
అంతం లేకుండా పోయింది ..!!

ప్రపంచాన్ని చూసే కనులు రెప్ప
సడిలో
మరణమై ఒక్కసారిగా మూతలు
పడ్డాయి
ఎవరు తోడు రాని జాడకి ఒంటరిగా
పయనిస్తూ
బంధాలన్నీ వదిలి బ్రతుకు
పోరాటానికి ముగింపునిచ్చాయి ...!!

పేరు ప్రతిష్టలని మంచి చెడులని
ఆశ నిరాశలని వదిలి నీ వెంటే అని
వెనకే నడుస్తూ దేహాన్ని వదిలి
అంతిమ యాత్రకు సిద్ధమైంది ..!!

చెదరని జ్ఞాపకాలుగా మారిన
సమాధుల ఆనవాళ్ళు
కని పెంచిన బంధాలకు మిగిల్చి
తరలి రాని లోకాలకు వెళ్ళి
మహా ప్రస్థానానికి నాంది పలికింది
..!!
జీవితమంటే ఇంతే అని ..
గమ్యాన్ని చేరుకోవడమని ..!!

- స్వప్న మేకల
9052221870

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో హామీపత్రాన్ని జతచేస్తూ పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com

మానవీయ సంబంధాలు పెంచాలి

గతేడాది డిసెంబర్ 28 తేదీన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో pocso 2012 (protection of children from sexual offences) చట్టంలో గల 4,5,6,9,14,15,42 సెక్షన్లకు పలు సవరణలను ప్రతిపాదించింది. గతంలో జమ్మూకశ్మీర్లో 'కథువా' సంఘటన, ఉత్తరప్రదేశ్‌లో 'ఉన్నావ్' సంఘటనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2012లో ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. అప్పట్లో ఈ చట్టాన్ని 18 ఏళ్లలోపు వయస్సు పిల్లల వరకు మాత్రమే పరిమితం చేశారు. అప్పట్లో ఈ చట్టం విధించే శిక్షలలో కొంత సడలింపులుండేవి. కానీ ప్రస్తుతం 18 ఏళ్ల లోపు పిల్లలపై లైంగిక దాడులు జరుపుతున్న వారికి మరణశిక్ష విధించేటట్లు కేంద్ర మంత్రివర్గం ప్రతిపాదనలు చేసింది. ఇప్పటికే పలు రాష్ట్రాలు 12 ఏళ్ల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు చేస్తున్న వారికి మరణశిక్ష విధించాలని స్వతంత్రంగా రాష్ట్ర పరిధిలో చట్టాలు చేసి ఉన్నాయి. అలాగే ప్రకృతి విపత్తుల సమయంలో పిల్లలపై జరిగే లైంగిక దాడులు కూడా ఈ చట్ట పరిధిలోకి వచ్చేటట్లు మంత్రివర్గం ప్రతిపాదన చేసి ఉంది. ఇంకా ముఖ్యంగా ఆడపిల్లలకు త్వరగా యవ్వనదశలోకి (కౌమారదశ లోకి) తెచ్చేందుకు కొంతమంది వ్యక్తులు కొన్ని హార్మోన్లను ఇంజక్షన్ రూపంలో ఇవ్వడం జరుగుతోంది. ఇలాంటి సంఘటనలు దేశంలో ఇటీవల కాలంలో వ్యభిచార గృహాలలో జరిగాయి. దీనిని కూడా తీవ్రమైన నేరంగా పరిగణించడం జరుగుతుందని కేంద్ర మంత్రివర్గం ప్రతిపాదన చేసి ఉన్నది. కేసులను బట్టి ఈ విధమైన పనులు చేస్తున్న వ్యక్తులకు భారీగా శిక్ష విధిస్తారని కొత్త ప్రతిపాదనలు చేశారు. అలాగే చిన్న పిల్లలతో తీసిన నీలి చిత్రాలు ఇంటర్నెట్లో అందుబాటులో లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన కూడా. ఇలాంటి నీలి చిత్రాలను సామాజిక మాధ్యమాల్లోకి ఫార్వర్డ్ చేస్తున్న వారికి జైలుశిక్ష, జరిమానా భారీగా ఉంటాయని కేంద్ర మంత్రివర్గం ప్రతిపాదన చేసింది. ఈ సవరణలు దేశంలో గల పలువురు మానసిక నిపుణుల అభిప్రాయంతో చేసినట్లు తెలుస్తున్నది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారి శారీరక, మానసిక, మేధోపరమైన సామాజిక అభ్యున్నతికి కేంద్రం చేస్తున్న సవరణగా ఈ విషయమై కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అభివర్ణించారు. అయితే దేశంలో మైనర్ బాలబాలికలపై తరచూ జరుగుతున్న లైంగిక దాడులు పరిశీలించి చూస్తే వాటి వెనక గల అనేక కారణాలను గుర్తించవచ్చు. ఇటీవల కాలంలో మన దేశంలో, మన రాష్ట్రంలో మైనర్ బాల బాలికలపై లైంగిక దాడులు, వేధింపులు అనేకం జరిగాయి. ఈ లైంగిక దాడులు, వేధింపులు మగ, ఆడ అనే తేడా లేకుండా జరుగుతుండడం గమనార్హం.



ఇటీవల విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం ఐతన్నపాలెం గ్రామంలో 9 ఏళ్ల బాలికపై గుర్తుతెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడటం. నిన్న కర్ణాటక రాష్ట్రంలో బసవేశ్వర్ నగర్‌కు చెందిన కీర్తన అనే పదవ తరగతి బాలికను ప్రేమించలేదని వరసకు బావ అయ్యే ఉన్మాది బడికి వెళ్లి బాలికను బడికి అతి చేరువలో వేట కొడవళ్లతో నరకడం. తరువాత ఒక బాలికను మద్యం బానిస చేసేసి కొందరు యువకులు అత్యాచారం జరపడం, గిద్దలూరు నగర పంచాయితీలో చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కీలక నిందితుడుగా ఓ మాజీ సైనికుడు ఉండడం గమనార్హం. మొన్నీమధ్య చోడవరంలో పద్మావతి అనే ఇంటర్మీడియట్ అమ్మాయిని కొంతమంది యువకులు అత్యాచారం చేసి హత్యచేసి ఆమె ఒంటిపై నున్న నగలు దొంగతనం చేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు. అలాగే గత దశాబ్ద కాలంలో చూసుకుంటే విజయవాడలో వైష్ణవి అనే బాలికను దగ్గర బంధువులు హత్య చేయించడం, శ్రీకాకుళం జిల్లా దోసరి గ్రామంలో నవీన్, నితిన్ అనే విద్యార్థులను బంధువులు ప్రాణాలు తీయడం మొదలగునవి చూస్తుంటే ఈ దేశంలోని దుర్మార్గుల, కామాంధుల ప్రవర్తన ఏ విధంగా తారాస్థాయిలో ఉందో తెలుస్తుంది. అసలు ఈ దేశం ఎటుపోతుందో అర్థం కావడం లేదు. అలాగే ప్రింట్ మీడియాలో కొన్ని సంఘటనలకు సంబంధించిన వార్తలు పతాకశీర్షికల్లో వస్తున్నాయి. కొన్ని అయితే ఏ మూలనో ప్రచురించి చేతులు దులుపుకోవడం జరుగుతున్నది. ఏదేమైనప్పటికీ ఈ హత్యలు అత్యాచారాలు సామాజిక, ఆర్థిక కారణాలతోనే జరుగుతున్నవిగా చెప్పవచ్చు. ముఖ్యంగా నేటి సినిమాలలో, టీవీ సీరియల్స్‌లో వస్తున్న హింసాత్మక ప్రేరేపితాలు చూసి జనం తప్పుదోవ పట్టేస్తున్నారు. ముఖ్యంగా యువత పెడదారిని ప్రయాణం చేస్తున్నది. మద్యం, మత్తు పదార్థాలకు యువత బానిసలై తాగిన మైకంలో ఎక్కువగా ఇలాంటి సంఘటనలు జరిగేందుకు కారణాలవుతున్నాయి. సామ్రాజ్యవాద మార్కెట్‌లో భాగంగా వస్తున్న వివిధ రకాల వస్తువుల మోజులో పడి యువత ఫ్యాషన్ పేరిట రకరకాలుగా విచ్చలవిడిగా తిరిగి, ఏ కారణంగానైనా కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నట్లయితే ఆ ఒత్తిడిని భరించలేక ఇలాంటి పనులు చేస్తున్నారు. ఇంకా తరచి చూస్తే పెద్దల మధ్య ఉన్న వివిధ రకాల తగాదాలకు పిల్లలు, అలాగే ముఖ్యంగా మైనర్ బాలబాలికలు బలి అవుతున్నారు. అమాయకత్వంతో కల్లాకపటం తెలియని పసి మొగ్గలను ఆదిలోనే తుంచి వేయడం ఎంతవరకు న్యాయం? ఆటపాటల్లో చదువుల్లో మేటిగా నిలిచి గురువుల, పెద్దల అభిమానాన్ని చూరగొన్న ఇటువంటి బాల బాలికలను తమ స్వార్థ కుటుంబ కలహాలకు బలిచేయడం ఎంతవరకు సమంజసం? ఆలోచించుకోవలసిన బాధ్యత నాగరికులపై ఉన్నది.

అనాదిగా భారతీయులు తమ జీవన విధానంలో నైతిక విలువలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ నేటి ప్రజలు తమ జీవన విధానంలో పాశ్చాత్య పోకడలకు, మీడియాలో వస్తున్న నేరపూరిత అంశాలకు ఆకర్షింపబడి అనాదిగా వస్తున్న భారతీయ వారసత్వ నైతిక ప్రవర్తనకు క్రమేపీ దూరమవుతున్నారు. ఈ కారణంగా చాలామంది వ్యక్తులు అసాధారణ ప్రవర్తన కలిగి అనేక అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారు. బడిలో, గుడిలో, మడిలో అక్కడా ఇక్కడా అని తేడా మరచి చాలామంది వ్యక్తులు బాలల హక్కులను కాలరాస్తూ బాలలపై హత్యలు, అత్యాచారాలు, వేధింపులు తలపెడుతున్నారు. ఇటువంటి దారుణదాష్టీకాలను, నీతిమాలిన పనులను, అమానవీయ సంఘటనలను నేటితరం ప్రగతిశీలురు, నీతిమంతులు, సామాజిక శ్రేయోభిలాషులు ఖండించాల్సిన తరుణం ఏర్పడింది. ఈ క్రమంలో మేధావులంతా ప్రజలలో తగిన చైతన్యాన్ని తీసుకురావలసిన అవసరం ఉన్నది. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో మరింత శ్రద్ధతో ఉండాలి. ఎంతటి దగ్గరి బంధుపైన అయినా ఏమాత్రం అనుమానం వచ్చినా ఆ వ్యక్తులపై తగు నిఘా ఏర్పరచి అటువంటి వ్యక్తులకు మన పిల్లలను దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందని గ్రహించాలి. ముఖ్యంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు మరింత జాగరూకత వహించి పాఠశాలల్లో పిల్లల రక్షణకై తగు ఏర్పాట్లు చేయాలి. ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల జాగ్రత్తకై తగు సూచనలు ఇవ్వాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా వెంటనే ఉపాధ్యాయులు పోలీసుల సాయాన్ని పొందాలి. ఉపాధ్యాయులు పాఠశాలలో నైతిక విలువలు పెంపొందించే కథలు, పాటలు, మాటలు విద్యార్థులకు చెప్పడం ద్వారా విద్యార్థులు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దబడతారు. భారతీయ సంప్రదాయాల, ఆచారాల పట్ల గౌరవం కలిగేటట్లు ఉపాధ్యాయులు విద్యార్థుల హృదయాలలో హత్తుకునేటట్లు బోధన సాగించాలి. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి నైతిక ప్రవర్తనకు అనుకూలమైన అంశాలను పదేపదే చెప్తూ ఉండాలి. పిల్లలు అసాధారణ ప్రవర్తనలో ఉంటే వారికి వివిధ రకాల కౌన్సిలింగ్స్‌ను ఇప్పించేందుకు మానసిక నిపుణుల వద్దకు తీసుకువెళ్లి వారి సమస్య పరిష్కారానికి తగు ఏర్పాటు చేయగలగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతికతను పెంపొందించే కార్యక్రమాలను సమాజంలో చేపట్టాలి. యువత చౌకగా దొరుకుతున్న ఇంటర్నెట్ సదుపాయాలను ఎక్కువశాతం వినియోగించడం జరుగుతున్నది. దీనిలో భాగంగానే ఇంటర్నెట్ వాడకంలో యువత, మైనర్ బాల బాలికలు అశ్లీల వెబ్సైట్లను, పోర్న్‌సైట్లను చూడటం అలవాటుగా మార్చుకున్నారు. ఈ తరుణంలో అటువంటి సైట్లను భారత్‌లో నిషేధించవలసిందిగా న్యాయస్థానాలు ఆదేశించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తూ, ఇప్పటికీ తాత్సారం చేస్తున్నది. తక్షణమే ఆ అశ్లీలసైట్లను నిషేధించి భారతదేశ యువతీ యువకులను నీతిమంతమైన పౌరులుగా తీర్చిదిద్దటానికి తగు ప్రయత్నాలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదని చెప్పవచ్చు. ముఖ్యంగా పాఠశాలలో పిల్లల రక్షణకై, కళాశాలలో బాలబాలికల రక్షణకై తగు ఏర్పాట్లు ప్రభుత్వమే చేయాలి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఈ చట్టాన్ని అనగా పోస్కో (POCSO) చట్టంలో పలు ప్రతిపాదనలు చేయడం న్యాయం అని చెప్పక తప్పదు. కానీ ఈ చట్టాన్ని అమలు చేసే తీరులో ముఖ్యంగా పోలీసు యంత్రాంగం ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, తాత్సారం చేయకుండా, నిజాయితీగా, కఠినంగా అమలు చేయవలసిన అవసరం ఉందని గుర్తించాలి. వచ్చే తరాల లోనైనా మానవీయ సంబంధాలు మెరుగు పడి ఎటువంటి కార్పణ్యాలు లేని సమాజాన్ని చూడగలమని ఆశించవచ్చు.

పిల్లా తిరుపతిరావు, 7095184846



మరోసారి సమ్మె సెగ

- 8, 9 తేదిల్లో బ్యాంకులు బంద్


న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో వరుస సమ్మెల బెడద ఇప్పట్లో వదిలేలా కనబడటం లేదు. గత ఏడాది డిసెంబరులో మూడు ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి నిరసనగా రెండు రోజులు (వేరు వేరు రోజులు) బంద్ నిర్వహించిన బ్యాంకు ఉద్యోగులు ఈ ఏడాది కూడా మరో రెండు రోజులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఉదోగవిధానాలపై కేంద్రం తీరుపై నిరసనగా పది ట్రేడ్ యూనియన్లు సమ్మెకు పిలుపునివ్వగా దానికి బ్యాంకు సంఘాలు మద్దుతు పలికాయి. దీంతో వచ్చే వారం 8, 9 తేదీల్లో సమ్మెకు దిగన్నుట్లు బ్యాంకు సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. కాగా, 6వ తేదీ ఆదివారం కావడంతో బ్యాంకులకు సెవవు ఉండనుంది. ఆ తర్వాత 7వ తేదీ సోమవారం మాత్రమే బ్యాంకులు యథావిధిగా పని చేయనున్నాయి. తర్వాత వరుసగా రెండు రోజుల సమ్మె ఉండటంతో ఆర్థిక లావాదేవీలు జరిగేందుకు ఆటంకం ఏర్పడనుంది. ‘‘2019 జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ), భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య(బీఈఎఫ్ఐ) పిలుపునిచ్చాయి. ఈ సమాచారాన్ని సదరు యూనియన్లు భారత బ్యాంకుల సంఘానికి(ఐబీఏ) కు అందించాయి’ అని బీఎస్ఈ ఫైలింగ్ సందర్భంగా ఐడీబీఐ బ్యాంక్ పేర్కొంది. వేతన సవరణ, పెన్షన్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారానికై అఖిల భారత బ్యాంక్ అధికారుల సంఘం (ఏఐబీఓసీ) ఇచ్చిన పిలుపు



మేరకు డిసెంబరు 21న బ్యాంకుల అధికారులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఆ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనానికి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది డిసెంబరు 26న సమ్మె చేపట్టారు.

ప్రభుత్వానికి తగ్గిన టెల్కోల ఆదాయం

న్యూఢిల్లీ: టెలికాం రంగం నుంచి ప్రభుత్వానికి వచ్చే రాబడి 2017-18 సంవత్సరంలో 22 శాతం మేర తగ్గింది. ఈ కంపెనీల సర్వీసుల ద్వారా వచ్చే రాబడి తగ్గడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. టెలికాం కంపెనీలు ఆర్జిం చే రాబడి నుంచి లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ యూసేజ్ చార్జీ (ఎస్‌యూసీ)ని



ప్రభుత్వం వసూలు చేస్తుంది. అయితే కంపెనీల సవరించిన స్థూల రాబడి (ఏజీఆర్) తగ్గిన ఫలితంగా ప్రభుత్వానికి రాబడి తగ్గిందని కేంద్ర టెలికాం శాఖ మంత్రి మనోజ్ సిన్హా రాజ్యసభకు లిఖిత పూర్వకంగా తెలిపారు. 2017-18 సంవత్సరంలో పరిశ్రమ ఏజీఆర్ 18.62 శాతం తగ్గి రూ.1,60,787.9 కోట్ల నుంచి రూ.1,30,844.9 కోట్లకు చేరింది. ఇదే సంవత్సరంలో లైసెన్స్ ఫీజు ద్వారా ప్రభుత్వానికి రాబడి 18.12 శాతం తగ్గి రూ.10,670.6 కోట్లకు చేరుకుంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.13,032.9 కోట్లుగా ఉంది.

టెలికాంకు పెరిగిన వినియోగదార్లు

దేశంలో టెలికం వినియోగదారులు మరింత పెరిగారు. అక్టోబర్ చివరినాటికి భారత్‌లో 119.2 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ వెల్లడించింది. రిలయన్స్ జియోకు కోటి మంది చేరగా, ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు 3.66 లక్షల మంది వినియోగదారులు చేరినట్లు తెలిపింది. వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్, ఎంటీఎన్ఎల్, రిలయన్స్ కమ్యూనికేషన్లు మొత్తంగా 1.01 కోట్ల మంది వినియోగదారులను కోల్పోయాయి. వీరిలో వొడాఫోన్ ఐడియా 73.61 లక్షల మంది కస్టమర్లను కోల్పోగా, ఎయిర్‌టెల్ 18.64 లక్షలు, టాటా టెలి 9.25 లక్షలు, ఎంటీఎన్ఎల్ 8,068, ఆర్‌కామ్ 3,831 కస్టమర్లు ఇతర నెట్‌వర్క్‌లను ఎంచుకున్నారు.

హెచ్ఏఎల్‌కు పెరుగుతున్న రుణభారం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ఆర్థిక సంక్షోభాన్నిఎదుర్కొంటోంది. దీర్ఘకాలంనుంచి ఆర్డర్ ఒకటికి గురవుతున్నసంస్థ తాజాగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడం, తదితర అవసరాల కోసం వెయ్యికోట్లు రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. 20వేలకు పైగా ఉన్న ఉద్యోగులకు మూడు నెలల జీతాల చెల్లించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. గత రెండు మూడు దశాబ్దాల కాలంగా ధనవంతులుగా ఉన్న హెచ్ఏఎల్ సంస్థ మొదటిసారిగా నగదు కోసం అప్పు (ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా) చేసామని హెచ్ఏఎల్ డైరెక్టర్ ఆర్ మాధవన్ వ్యాఖ్యానించి ఉటంకిస్తూ టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. పుష్కలమైన ఆర్డర్ నిల్వలతో ఉన్న సంస్థ తాజాగా లోటు బడ్జెట్‌కి జారుకుందని మాధవన్ పేర్కొన్నారు. మార్చినాటికి ఈనగదు ప్రతికూలత భరించలేనంత



స్థాయిలో రూ. 6వేల కోట్లకు చేరుకోనుందన్నారు. ప్రధానంగా హెచ్ఏఎల్‌కు అతిపెద్ద కస్టమర్‌గా ఉన్న భారత వైమానిక దళం చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయిన కారణంగా ఆర్థిక ఒత్తిడికి దారితీసినట్టు డైరెక్టర్ తెలిపారు. 2017 సెప్టెంబర్ నాటికి రూ. 14,500కోట్లుగా బకాయిల్లో కేవల రూ. 2వేల కోట్లను మాత్రమే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ చెల్లించింది. 2017-18 సంవత్సరానికి రక్షణ మంత్రిత్వశాఖ 13,500 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. 2017-18 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలతో కలిపి సవరించిన బడ్జెట్ 33, 715 కోట్ల రూపాయలుగా ఉంది. మరోవైపు డిసెంబర్ 31 నాటికి 15,700 కోట్లు తాకిన బకాయిలు మార్చి 31 నాటికి 20,000 కోట్ల రూపాయలకు చేరవచ్చన్నారు. రూ. 14,500 కోట్ల బిఏఎఫ్ చెల్లించాల్సి ఉండగా, మిగిలిన బకాయిలు భారతీయ సైన్యం, నావికాదళం, కోస్ట్ గార్డ్స్ నుంచి రావాల్సి ఉంది.

ఈ పరిణామం సంస్థపై ఆధారపడిన దాదాపు 20వేల మంది సూక్ష్మ, చిన్నమధ్య తరహా వ్యాపారస్తులను ప్రభావితం చేయనుందని మాధవన్ ఆందోళన వ్యక్తం చేశారు. నగదు కొరత అప్పులవైపు నెడుతోందని, లేదంటే బకాయిలు చెల్లించడంలో ఎంఎస్ఎంఈలను బలవంతం చేయాలి. ఇది వారిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని చెప్పారు. కాగా మొత్తం ఉద్యోగుల సంఖ్య 29,035. వీరికి చెల్లించే నెలవారీ జీతాల మొత్తం రూ.358 కోట్లు.


మూగబోనున్న ఆకాశవాణి

నిర్వహణ వ్యయం పెరిగిపోవటమే ప్రధాన కారణం

- పలు అకాడమీల రద్దుకు ప్రసారభారతి నిర్ణయం



న్యూఢిల్లీ: ఆల్ఇండియా రేడియోకు అధిక వ్యయం ఆటకంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో నిర్వహణ వ్యయం తగ్గింపులో భాగంగా ఆల్ ఇండియా రేడియో (ఎఐఆర్) జాతీయ ఛానల్‌ను మూసివేయాలని ప్రభుత్వ రంగ ప్రసార సంస్థ ప్రసార భారతి నిర్ణయించింది. ఈ మేరకు ప్రసారభారతి తన నిర్ణయాన్ని డిసెంబరు 24న ఎఐఆర్ డైరెక్టరేట్‌కు తెలిపింది. ఇందుకోసం గత ఏడాది పలుమార్లు సంప్రదింపులు, చర్చలు జరిపిన అనంతరం తుది నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ జనరల్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని వెంటనే అమలు చేయాలని ఆలిండియా రేడియోను ఆదేశించింది. అలాగే అకాడమీస్ ఆఫ్ బ్రాడ్ కాస్టింగ్ అండ్ మల్టీ మీడియాను కూడా మూసివేయాలని నిర్ణయించింది. అలాగే ఐదు నగరాలు, అహ్మదాబాద్ హైదరాబాద్, లక్నో, షిల్లాంగ్, తిరువనంతపురంలోని ప్రాంతీయ శిక్షణ అకాడమీలను రద్దు చేయనుంది. ఇది తక్షణమే అమల్లోకి రానుంది. తోడాపూర్, నాగపూర్ సహా ఇతర నగరాల్లోని సిబ్బందిని వేరే ప్రదేశాలకు సర్దుబాటు చేయనుంది. జాతీయ చానెల్ ద్వారా భద్రపరిచే కార్యక్రమాల ఆర్కైవ్స్‌ను, డిజిటలైజేషన్‌కోసం ఢిల్లీలోని సెంట్రల్ ఆర్కైవ్స్ సెంటర్‌కు పంపించాలని జనవరి 3, 2019 తేదీన ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొంది. జాతీయ ఛానల్‌కు సంబంధించిన ట్రాన్స్‌మీటర్లు బలహీనంగా ఉండటం కూడా మూసివేతకు కారణమని ఏఐఆర్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. నాగపూర్‌లో ఉన్న ఒకే ఒక ట్రాన్స్‌మీటరు మాత్రమే ఒక మెగావాట్ సామర్థ్యాన్ని కలిగి ఉందని, ప్రస్తుత డిజిటల్ రేడియో యుగంలో ఇది సరిపోదని వ్యాఖ్యానించారు. అలాగే పటిష్టమైన శ్రోతల ప్రాతిపదిక లేని ఛానల్‌లో పెట్టుబడులు పెట్టడం సరైంది కాదని సీనియర్ నిర్వాహకులు భావించారని ఆయన వివరించారు. అంతేకాదు ప్రస్తుతం కొన్ని ఏఐఆర్ కార్యక్రమాలను అవుట్‌సోర్స్ ద్వారా నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా



ఏఐఆర్ వెబ్‌సైట్‌ను ప్రైవేటు వ్యక్తుల ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఐఆర్‌లోని కొన్ని విభాగాలు ఈ నిర్ణయంపై విచారాన్ని వ్యక్తం చేస్తున్నాయి. జాతీయ ఛానల్ ప్రసారాలు చాలా ముఖ్యమైన భాగమని, మొత్తంగా దాన్ని మూసివేయడం కంటే ఖర్చులను తగ్గించుకునేందుకు ఇతర మార్గాలను అన్వేషించాలని కోరుతున్నాయి. కాగా ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటలకు జాతీయ ప్రసారాలు ప్రసారమయ్యే నేషనల్ చానల్ 1987లో ప్రారంభమైంది. 31 సంవత్సరాలకుపైగా జాతీయ వార్తలను, కీలక అంశాలను ప్రజలకు చేరవేయడంలో చురుకైన కీలక పాత్ర పోషించింది.

ఇంకొంచెం గడువివ్వండి

ప్రభుత్వానికి ఈ-కామర్స్ సంస్థలు వినతి



న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంబంధించి కొత్త నిబంధనల అమలుకు గడువు పొడిగించాలంటూ బడా ఈ-కామర్స్ సంస్థలు.. కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిసింది. మార్పులు అమలు చేసేందుకు కనీసం 4- 5 నెలలు పడుతుందని, కాబట్టి అంత వరకూ సమయం ఇవ్వాలని అభ్యర్థించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. వాస్తవానికి ఫిబ్రవరి 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయి. కొత్త నిబంధనలు అమలుకు తగ్గట్టుగా వ్యాపార విధానాలు మార్చుకునేందుకు, ప్రస్తుతం వివిధ సంస్థలతో ఉన్న భాగస్వామ్య ఒప్పందాలను సవరించుకునేందుకు కొంత సమయం కావాల్సి ఉంటుందని.. కానీ డిసెంబర్ 26న చేసిన ప్రకటనతో తమకు కేవలం నెల రోజుల వ్యవధి మాత్రమే ఇచ్చినట్లయిందని ఈ- కామర్స్ కంపెనీకి చెందిన ఓ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పేర్కొన్నారు. అందుకే గడువు పొడిగించాలంటూ కేంద్రాన్ని కోరాలని ఈ-కామర్స్ సంస్థలు భావిస్తున్నట్లు చెప్పారు. ఇటీవలి సవరణలను కంపెనీలు అధ్యయనం చేస్తున్నామని, వీటిపై రాబోయే వారాల్లో కేంద్రాన్ని సంప్రదించే అవకాశం ఉందని మరో అధికారి పేర్కొన్నారు.

కొత్త నిబంధనల ప్రకారం విదేశీ పెట్టుబడులు గల ఈ కామర్స్ సంస్థలు.. తమకు వాటాలున్న ఇతర సంస్థల ఉత్పత్తులు ను సొంత పోర్టల్‌లో విక్రయించడానికి లేదు. అలాగే, ఏ విక్రేత కూడా తన వద్దనున్న మొత్తం నిల్వల్లో 25 శాతానికి మించి .. ఈ కామర్స్ పోర్టల్‌లో విక్రయించకూడదు. ఒకవేళ నిర్దేశిత స్థాయిని మించిన పక్షంలో ఈ కామర్స్ సంస్థే వాటిని కొనుగోలు చేసి, నిల్వ చేస్తోందని భావించాల్సి ఉంటుంది. ఫలితంగా ఇన్వెంటరీ ఆధారిత రిటైల్ సంస్థల్లో ఎఫ్‌డీఐలకు అనుమతి లేదన్న నిబంధనను ఉల్లంఘించినట్లవుతుంది. అయితే, 25 శాతం నిబంధనపై మరింత స్పష్టత అవసరమని ఈ-కామర్స్ వర్గాలు అంటున్నాయి. విక్రేతలు తమ ఖాతా వివరాలను ఈ-కామర్స్ సంస్థలతో పంచుకునేందుకు ఇష్టపడని పక్షంలో వారు కచ్చితంగా నిబంధనలు పాటిస్తున్నారో లేదో తెలుసుకోవడం సాధ్యం కాదని చెబుతున్నాయి.

మార్చికల్లా విమానాల్లో మొబైల్ సేవలు

న్యూఢిల్లీ: విమానాల్లో, ఓడల్లో మరో మూడు నెలల్లో మొబైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో మొబైల్ వినియోగానికి సంబంధించి విధివిధానాలను రూపొందించేందుకు ప్రభుత్వం ఒక మంత్రుల బృందాన్ని ఏర్పరిచింది. ఈ బృందం ఇకపై ప్రతి 15 రోజులకొకసారి సమావేశమయి ఇందుకు సంబంధించిన అడ్డంకులు, కావాల్సిన అనుమతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కనెక్టివిటీకి కావాల్సిన సేవలు తదితర అంశాలను చర్చించనుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించి వైమానిక, షిప్పింగ్, టెలికం రంగాలకు చెందిన కంపెనీలు, ప్రభుత్వ అధికారుల మధ్య ఒక సమావేశం కూడా జరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సమావేశానంతరం మంత్రులబృందం ఈ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ అనుమతులకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం గతంలో నోటిఫై చేసింది. ప్రస్తుతం నిబంధనలు విమానాల్లో మొబైల్ సేవలకు సంబంధించిన అనుమతులను డీజీసీఏ ఇవ్వనుంది. ఇదిలాఉండగా నిర్దిష్ట ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఇన్‌బిల్డ్‌గా మొబైల్‌సేవలు అందించే సదుపాయం కల్పించనున్నారు. అయితే ఈ సేవలు ఉపయోగించే హై శాటిలైట్ బ్యాండ్‌విడ్త్ చార్జీలు ఇన్‌ఫ్లైట్ మొబైల్ సేవలను దెబ్బతీయవచ్చని



టెక్నాలజీ సంస్థ హ్యూస్ ఇండియా హెచ్చరించింది. రెండు గంటల విమాన ప్రయాణంలో మొబైల్ సేవ వినియోగానికి టికెట్‌పై అదనంగా 700- 1000 రూపాయల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని, దీనివల్ల టికెట్ ధరలు పెరగవచ్చని అంచనాన్నాయి. ఇస్రోమాత్రమే ఈ బ్యాండ్‌విడ్త్ అందించే ఏకైక సంస్థ కావడం వల్ల చార్జీలు ఎక్కువగా ఉంటాయని తెలిపింది. అయితే అంతర్జాతీయ ధరలకు అనుగుణంగానే బ్యాండ్‌విడ్త్ సేవలను అందించే ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వైమానిక సంస్థలకు హామీ ఇచ్చింది.

ద్రవ్యోల్బణంతో పొంచిఉన్న ప్రమాదం

- రూపాయికి గడ్డుకాలమే
- ఫెడ్ రేట్ల పెంపు కూడా ప్రభావం చూపొచ్చు
- బ్రెగ్జిట్ అస్థిరత్వం ఎఫెక్ట్ రూపాయికి ఉండొచ్చు



న్యూఢిల్లీ: ఇండియన్ ఫైనాన్షియల్ మార్కెట్లపై అంతర్జాతీయ పరిస్థితులు ప్రభావం భారీగానే ఉండొచ్చని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ ఇటీవల తెలిపారు. 2019లో రూపాయి మళ్లీ 75 స్థాయికి పడిపోవచ్చని ఆయన అంచనా వేశారు. ఒక మీడియా చానెల్‌కు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలు వెల్లడించారు. కాగా 2018లో రూపాయి దాదాపు 9 శాతం మేర పతనమైంది. గతేడాది అక్టోబర్ నాటికి ఏకంగా 15 శాతం మేర పతనమైంది. ఫెడ్ రేట్ల పెంపు వల్ల అమెరికా డాలర్ బలపడటం, ముడిచమురు ధరలు పెరగడం వంటి అంశాలు ఇందుకు కారణం. బ్రెంట్ ధర బ్యారెల్‌కు ఒకానొక సమయంలో 86 డాలర్లకు ఎగసింది. రూపాయి అక్టోబర్ 9న జీవిత కాల కనిష్ట స్థాయి 74.39 స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే.

టర్కీ వంటి దేశాల్లో కరెన్సీ పతనం వంటి అంశాలు వల్ల కూడా భారత్‌లాంటి వర్ధమాన మార్కెట్లకు ప్రమాదం పొంచి ఉందని జయంత్ మాంగ్లిక్ పేర్కొన్నారు. 2019లో రూపాయి క్షీణించడానికి చాలా కారణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల పెంపు కూడా ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. రేట్ల పెంపు వల్ల ఇండియన్ స్టాక్ మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కు వెళ్లిపోతాయని పేర్కొన్నారు. దీని వల్ల రూపాయిపై ఒత్తిడి నెలకొంటుందని తెలిపారు. అదేసమయంలో ఫెడ్ రేట్ల పెంపు అమెరికా డాలర్ బలపడుతుందని గుర్తు చేశారు. అమెరికా రక్షణాత్మక విధానాల వల్ల ఇప్పటికే కూడా అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లలో ఆందోళనలు ఉన్నాయని జయంత్ మాంగ్లిక్ తెలిపారు. వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగుదల వల్ల ప్రతికూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. బ్రెగ్జిట్ అస్థిరతలతో రూపాయిపై ప్రభావం పడొచ్చని తెలిపారు. అనిశ్చితుల కారణంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు వర్ధమాన దేశాల నుంచి ఇన్వెస్ట్‌మెంట్లు సురక్షితమైన డాలర్ వైపు వెళ్లొచ్చని పేర్కొన్నారు. దేశీయంగా చూస్తే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒడిదుడుకులు ఎక్కువగా ఉండొచ్చని జయంత్ మాంగ్లిక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక విధానాలను అవలంబించొచ్చని అంచనా వేశారు. ద్రవ్యోల్బణం పెరుగుదల వల్ల రూపాయిపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. మొత్తంగా చూస్తే రూపాయి 2019 డిసెంబర్ కల్లా 75 స్థాయికి పడిపోవచ్చని అంచనా వేశారు. మరోవైపు ఫిచ్ రేటింగ్స్ కూడా రూపాయి 75 స్థాయికి క్షీణించొచ్చని పేర్కొంది.

ఈ-వాలెట్‌పై ఆర్బీఐ కొత్త రూల్స్

- వినియోగదారులకు పెరగనున్న ప్రయోజనం

న్యూఢిల్లీ: ప్రీపెయిడ్ వాలెట్లను వినియోగించే కస్టమర్లు మోసానికి గురైతే వారు మూడు రోజుల్లోపు సదరు మోసాన్ని గురించి ఫిర్యాదు చేయాలని, అప్పుడు సదరు మోసానికి సంబంధించి కస్టమర్లకు ఎలాంటి బాధ్యత ఉండదని ఆర్బీఐ స్పష్టం చేసింది. జరిగిన మోసానికి అటు కంపెనీ, ఇటు కస్టమర్‌కు సంబంధం లేకుంటే మూడు రోజుల లోపు ఫిర్యాదుచేసిన కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపింది. ఇంతవరకు బ్యాంకు మోసాలకు సంబంధించి ఇలాంటి నిబంధనలున్నాయి. తాజా ఆదేశాలతో కస్టమర్లకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఒకవేళ కస్టమర్ 4- 7 రోజుల్లోపు ఫిర్యాదు చేస్తే లావాదేవీ విలువ లేదా రూ. 10,000(ఏది తక్కువైతే అది) వరకు కస్టమర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆర్బీఐ తెలిపింది. అంటే మూడు రోజుల తర్వాత ఫిర్యాదు చేసిన కస్టమర్‌కు పడివేల రూపాయలకు పైన నష్టం వాటిల్లితే తప్ప ఎలాంటి సాయం అందదు.

ఒకవేళ కస్టమర్ మోసం జరిగిన 7 రోజుల అనంతరం ఫిర్యాదు చేస్తే సదరు కస్టమర్‌కు పరిహారం చెల్లించాలా లేదా అనేది వాలెట్ నియమనిబంధనలను అనుసరించి ఉంటుందని ఆర్బీఐ తెలిపింది. అంటే ఏడు రోజుల అనంతరం ఫిర్యాదు చేసిన కస్టమర్‌కు పరిహారం ఇవ్వడమా? మానడమా? అనేది పూర్తిగా వాలెట్ కంపెనీపై ఆధారపడి ఉంటుంది. ఈ తరహా నిబంధనలు కస్టమర్లలో ధైర్యాన్ని నింపడంతో పాటు వాలెట్



బాధ్యతను పెంచుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఒకవేళ కస్టమర్ నిర్లక్ష్యం కారణంగా మోసం సంభవిస్తే అప్పుడు కంపెనీకి ఎలాంటి బాధ్యత ఉండదని, కస్టమర్ పూర్తి నష్టం భరించాలని నిబంధనల్లో పేర్కొన్నారు. అయితే సొంత తప్పిదం వల్ల మోసపోయిన కస్టమర్ సదరు కంపెనీకి ఫిర్యాదు చేస్తే ఆపై ఏదైనా నష్టం వాటిల్లితే అప్పుడు కంపెనీనే బాధ్యత వహిస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో ఎక్కువభాగం కస్టమర్ల అజాగ్రత్త వల్లనే జరుగుతున్నాయని, ఈ నిబంధనతో వాలెట్ల వైతన్యం వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కస్టమర్ల ఫిర్యాదులు చేయడానికి వీలుగా వాలెట్ కంపెనీలు 24X7 కస్టమర్ కేర్ సేవలను అందుబాటులో ఉంచాలని ఆర్బీఐ ఆదేశించింది.

సింగిల్ టేక్ యాక్షన్ పార్ట్


రాజశేఖర్

'పి.ఎస్.వి.గరుడవేగ' తర్వాత రాజశేఖర్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'కల్కి'. 1983 బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న క్రైమ్ థ్రిల్లర్ ఇది. 'అ!' ఫేమ్ ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా యాక్షన్ పార్ట్‌ను రీసెంట్‌గా తెరకెక్కించారట. ఆసక్తికరమైన విషయమేమంటే హీరో రాజశేఖర్ ఇందులో ఏడు నిమిషాల పాటు ఉండే యాక్షన్ సీన్‌ను సింగిల్ షాట్‌లో.. సింగిల్ టేక్‌లో పూర్తి చేసేశారట. ఇంత పెద్ద యాక్షన్ సీక్వెన్స్‌ను సింగిల్ షాట్‌లో చేయడం చాలా గొప్ప విషయమని యూనిట్ సభ్యులు అంటున్నారు. రాజశేఖర్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. శివానీ శివాత్మిక మూవీస్ బ్యానర్ సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై రూపొందనున్న ఈ చిత్రానికి సి.కల్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ నిర్మాతలు. ఈ చిత్రంలో ఆదాశర్మ, నందితాశ్వేత, స్కార్లెట్ విల్సన్ హీరోయిన్లుగా సందడి చేయనున్నారు.



వి.వి.వినాయక్ ఆవిష్కరించిన 'యమ్6' ట్రైలర్

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న చిత్రం 'యమ్6'. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఆవిష్కరించి చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హీరో ధ్రువ, నిర్మాత విశ్వనాథ్ తన్నీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ ''వినాయక్‌గారి చేతులమీదుగా మా 'యమ్6' ట్రైలర్ విడుదల కావడం మాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఈ సందర్భంగా ఆయనకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఖర్చు విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఎంతో క్వాలిటీగా నిర్మించాం. దర్శకుడు జైరాం చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. మా హీరో ధ్రువ కొత్తవాడైనప్పటికీ చక్కటి నటనను ప్రదర్శించాడు. ఈ చిత్రంలో ధ్రువ సరసన మిస్ బెంగళూరు అశ్విని హీరోయిన్‌గా నటించింది. ఆమెకు ఇదే తొలి సినిమా. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. హీరో ధ్రువ మాట్లాడుతూ ''అందర్నీ అలరించే విభిన్నమైన పాత్రలు పోషించి ఇండస్ట్రీలో నటుడిగా నాకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవాలన్నది నా చిరకాల కోరిక. నిర్మాత విశ్వనాథ్ తన్నీరు, దర్శకుడు జైరామ్ ఇచ్చిన ప్రోత్సాహంతో ఎక్కడా ఇబ్బంది పడకుండా నటించగలిగాను. ఒక మంచి సినిమా ద్వారా నేను హీరోగా పరిచయమవుతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. నా మొదటి సినిమా ట్రైలర్‌ను ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్‌గారు ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.

సరికొత్త లుక్ కోసం


రష్మిక

విజయ్‌దేవరకొండతో 'గీత గోవిందం' తర్వాత రష్మిక నటిస్తోన్న మరో చిత్రం 'డియర్ కామ్రేడ్'. కాకినాడ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ స్టూడెంట్ లీడర్‌గా, రష్మిక లేడీ క్రికెటర్ పాత్రల్లో కనపడబోతున్నారు. తెలుగు సినిమాలకు సంబంధించిన ఓ హీరోయిన్ పూర్తి స్థాయి మహిళా క్రికెటర్‌గా కనపడనుండటం విశేషం. ఇలాంటి పాత్ర కోసం రష్మిక ప్రతి రోజూ రెండు గంటల పాటు ప్రాక్టీస్ చేయడమే కాదు.. లుక్ విషయంలో కూడా రష్మిక కొత్తగా కనపడనుందట. అందుకోసం ఆమె తల వెంట్రుకలను కాస్త తగ్గించుకుంటుందట. అంటే బాబ్డ్ హెయిర్ స్టైల్లో ఉంటుంది కానీ.. బాబ్డ్ హెయిర్ స్టైల్ కాదు. భరత్ కమ్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

మరో మల్టీస్టారర్‌కు రెడీ!


అమితాబ్ బచ్చన్


ఐశ్వర్యారాయ్

జయాపజయాలతో సంబంధం లేకుండా మణిరత్నం రూపొందించే సినిమాలకు ప్రత్యేక ఆదరణ ఉంటుంది. ఆయన సినిమా చేస్తున్నారంటే అది ఎప్పుడు విడుదలవుతుందా అని ఎదురు చూసే అభిమానులు కూడా ఆయనకు ఎక్కువే. ఆయన దర్శకత్వంలో ఎన్నో దృశ్యకావ్యాలు తెరకెక్కాయి. ఈమధ్యకాలంలో ఆయన చేసిన కొన్ని సినిమాలు ప్రేక్షకుల్ని నిరాశ పరిచాయి. అయితే ఆమధ్య వచ్చిన 'నవాబ్'తో మరోసారి తన మార్క్‌ను చాటుకున్నారు మణిరత్నం. ఇప్పుడు మరో మల్టీస్టారర్‌ను తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఇంతకు ముందే చేయాలనుకున్న 'ఒన్నియిన్ సెల్వన్' చిత్రాన్ని ఇప్పుడు చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇంతకుముందు విజయ్, మహేశ్‌బాబు, ఐశ్వర్యరాయ్‌లాంటి స్టార్స్‌తో 'పొన్నియిన్ సెల్వన్' చిత్రాన్ని తెరకెక్కించే ప్రయత్నం చేశారు. అయితే అప్పుడు బడ్జెట్ కారణాల వల్ల డ్రాప్ అయ్యింది. అదే కథతో ఇప్పుడు విక్రమ్, శింబు, జయంరవి హీరోలుగా సినిమా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇక ఇందులో ప్రత్యేకం ఏమిటంటే బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్‌బచ్చన్‌ను, ఆయన కోడలు, అందాలరాశి ఐశ్వర్యరాయ్‌ను నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తాజా సమాచారం. ఇప్పటికే మణిరత్నం అమితాబ్‌ను కలిసి కథ వినిపించినట్లు తెలిసింది. ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందించనున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్ళనుంది.


రియా చక్రవర్తి

మెగా అల్లుడి జతగా..!

చిరంజీవి రెండవ అల్లుడు కల్యాణ్ దేవ్ 'విజేత' చిత్రంతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో సినిమాకు కల్యాణ్‌దేవ్ రెడీ అవుతున్నారు. రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందబోయే ఈ సినిమాకు పులివాసు దర్శకుడు. ఇందులో కల్యాణ్ దేవ్ హీరోగా నటిస్తుండగా, హీరోయిన్‌గా రియా చక్రవర్తిని ఎంపిక చేయడానికి చిత్ర యూనిట్ ఆసక్తి చూపుతుంది. 'తూనీగ తూనీగ' తర్వాత రియా చక్రవర్తి తెలుగులో చేయబోయే చిత్రమిదే. ముందు ఈ సినిమాలో సుధీర్‌బాబు హీరోగా, మెహరీన్ హీరోయిన్‌గా నటించాల్సింది. కానీ ఇద్దరూ కొన్ని కారణాలతో ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నారు. ఈ సినిమాకు సంబంధించిన వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

నోయల్-ఎస్తేర్ వివాహం



సింగర్‌గా, నటుడిగా మంచి పేరు తెచ్చుకున్న నోయల్ ఇప్పుడు ఓ ఇంటివాడయ్యాడు. ఆయన నటి ఎస్తేర్‌ను వివాహం చేసుకున్నారు. క్రైస్తవ మత పద్ధతిలో వీరి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెళ్లిలో దిగిన ఫొటోను నోయెల్ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. తాము ఇప్పుడు ఇద్దరు కాదని, ఒక్కటే అని అన్నారు. తన హృదయానికి ఆమే రాణి అని నోయెల్ ట్వీట్ చేశారు. అందరి ఆశీస్సులు కావాలని కోరారు. వీరి వివాహానికి ఎస్.ఎస్.రాజమౌళి, రమ కూడా హాజరయ్యారు. మంగళూరులో వీరి వివాహం జరిగింది. నటుడిగా 'మగధీర', 'ఈగ', 'కుమారి 21 ఎఫ్', 'నాన్నకు ప్రేమతో', 'ప్రేమమ్', 'రంగస్థలం', 'హలో గురు ప్రేమ కోసమే', 'పడి పడి లేచె మనసు' వంటి సినిమాల్లో నటించి నటుడుగా మంచి పేరు తెచ్చుకున్నారు నోయల్. ఇక మంగళూరుకు చెందిన ఎస్తేర్ '1000 అబద్ధాలు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైంది. ఆ తర్వాత 'భీమవరం బుల్లోడు', 'జయ జానకి నాయక' చిత్రాల్లో ఆమె నటించింది. అలాగే కొన్ని కన్నడ, హిందీ సినిమాల్లోనూ ముఖ్యమైన పాత్రలు పోషించింది ఎస్తేర్. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న వీరిద్దరు వివాహబంధంతో ఒక్కటయ్యారు.

100 కోట్ల క్లబ్‌లో 8 సినిమాలు


రోహిత్ శెట్టి

ఏ దర్శకుడికైనా తను రూపొందించిన సినిమా సూపర్‌హిట్ అవ్వడం, కలెక్షన్లు కొల్లగొట్టడాన్ని మించిన ఆనందం మరొకటి ఉండదు. అది కూడా తను చేసిన సినిమాల్లో ఎనిమిది సినిమాలు అదే తరహాలో కలెక్షన్లు సాధిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు బాలీవుడ్ డైరెక్టర్ రోహిత్ శెట్టి పరిస్థితి కూడా అలాగే ఉంది. తను చేసిన సూపర్‌హిట్ సినిమాలతో ఓ అరుదైన రికార్డును సాధించారు శెట్టి. ఆయన రూపొందించిన సినిమాల్లో వరుసగా ఎనిమిది బాక్సాఫీసు వద్ద రూ.100 కోట్లు వసూలు చేశాయి. ఈ ఘనత సాధించిన ఏకైక బాలీవుడ్ దర్శకుడిగా రోహిత్ చరిత్ర సృష్టించారు. ఈ సందర్భంగా రణ్‌వీర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేశారు. రోహిత్ ఎనిమిదో సినిమా రూ.100 కోట్లు దాటిందని ఆనందం వ్యక్తం చేశారు. రోహిత్‌శెట్టి చేసిన ఆ ఎనిమిది సినిమాలు ఏమిటంటే.. 'సింబా', 'గోల్‌మాల్ ఎగైన్', 'దిల్‌వాలే', 'సింగం 1, 2', 'చెన్నై ఎక్స్‌ప్రెస్', 'బోల్ బచ్చన్', 'గోల్‌మాల్ 3'.



బైపాస్ రోడ్‌లో భావన

దక్షిణాది సినిమాల్లో హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న వారందరి చూపు బాలీవుడ్ వైపే ఉంటుంది. హిందీ సినిమాల్లో నటిస్తే జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవచ్చు అనేది వారి ఆలోచన. అయితే ఆ అవకాశం అందర్నీ వరించదు. కానీ, కొంతమందికి మాత్రం తక్కువ సమయంలోనే బాలీవుడ్ సినిమాల్లో నటించే అవకాశం వస్తుంది. అలాంటి వారిలో హీరోయిన్ భావనారావు ఒకరు. అతి తక్కువ సమయంలో బాలీవుడ్ నుంచి ఈ భామకు పిలుపు వచ్చింది. మాతృభాషైన కన్నడలో హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్న భావన తమిళంలోనూ సినిమాలు చేసింది. ఈ భామ కన్నడంలో 2017లో నటించిన సత్యహరిచంద్ర చిత్రం ఆమెకు అభినందనలు, అవార్డులను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం శివరాజ్‌కుమార్, సుదీప్, ఎమీజాక్సన్ నటిస్తున్న 'విలన్' అనే చిత్రంలో ముఖ్య పాత్రను పోషిస్తోంది. ఇదిలా ఉంటే హిందీలో నీల్ నితిన్ ముఖేష్‌కు జంటగా 'బైపాస్ రోడ్' అనే చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది భావన. నూతన సంవత్సరం తనకు చాలా ఆనందంగా ప్రారంభమైందని, తొలిసారిగా బాలీవుడ్‌కి ప్రవేశించడం చాలా సంతోషంగా ఉందని చెబుతోంది భావన.

మళ్లీ దర్శకత్వ ఆలోచనలో..


పోసాని కృష్ణమురళి

రచయితగా కెరీర్‌ను స్టార్ట్ చేసిన పోసాని కృష్ణమురళి తదుపరి దర్శకుడిగా మారారు. 'ఆపరేషన్ దుర్యోధన' వంటి సక్సెస్ ఫుల్ మూవీ తర్వాత 'శ్రావణ మాసం' డిజాస్టర్ కావడంతో పోసాని దర్శకత్వానికి దూరమయ్యారు. ఆ తర్వాత నటుడిగా ఫుల్ బిజీగా మారిపోయారు. ఒక వైపు వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ తరపున రాజకీయాల్లో చురుకుగా ఉంటున్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోసాని ఓ సినిమాను డైరెక్ట్ చేయబోతున్నారట. రాజకీయ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పరిస్థితులను ఆధారంగా చేసుకుని తెరకెక్కబోయే ఈ సినిమా సెటైరికల్‌గా ఉంటుందని సమాచారం. సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తి చేసి సమ్మర్‌లో సినిమాను విడుదల చేసేలా పోసాని ప్లాన్ చేస్తున్నారట.



ఊపిరి ఆడక ఐదుగురి మృతి

- శ్రీనగర్‌లోని బెమీనాలోని విషాదం
- మృతులంతా ఒక కుటుంబంవారే..

శ్రీనగర్, జనవరి 5: శ్రీనగర్‌లోని బేమినా ఏరియాలో తీవ్ర విషాదం నెలకొంది. ఊపిరాడక ఐదుగురు కుటుంబ సభ్యులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ఈ సంఘటన జరిగిన ప్రాంతానికి పోలీసులు చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే గ్యాస్ లీకేజీ కావడం వల్లే శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ఆ ఐదుగురు మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

కర్ణాటకలో ఆరుగురి ఆత్మహత్య..

అప్పుల భారం భరించలేక కర్ణాటకలో ఆరుగురు కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్నారు. పురుగులమందు తాగి తుదిశ్వాస విడిచారు. కొప్పాల్‌లో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పంట నష్టపోవడానికి తోడు అప్పులు పెరగడంతో.. శేఖరయ్య బిడ్నాల్, ఆయన భార్య జయమ్మ, నలుగురు కూతుళ్లు బసమ్మ, గౌరమ్మ, సావిత్రి, పార్వతి విషం సేవించి ప్రాణాలు విడిచారు. వీరిలో బసమ్మ, గౌరమ్మ వివాహాలు అయినట్లుగా తెలిసింది.



లోయలో స్కూలు బస్సు బోల్తా

- ఆరుగురు విద్యార్థులు, డ్రైవర్ మృతి
- హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్‌లో ఘటన

షిమ్లా, జనవరి 5: హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లాలో శనివారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న పాఠశాల బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు, ఒక డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్ర విద్యార్థులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సంగ్రహ పట్టణంలోని డీఏవీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు స్కూలు విద్యార్థులు బస్సులో వెళ్తుండగా షిమ్లాకు 150 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటు చేసుకుంది

మోదీని నిలదీయండి

- ట్విట్టర్‌లో రాహుల్ పిలుపు

న్యూఢిల్లీ, జనవరి 5: రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. తాను పార్లమెంటులో అడిగిన ప్రశ్నలకు రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ సమాధానం చెప్పలేదని, ఆ రెండు ప్రశ్నలను దేశ ప్రజలంతా ప్రధాని మోదీని అడగాలని కోరారు. ''ఆర్ఎం (రక్షణ మంత్రి) పార్లమెంటులో 2 గంటలపాటు మాట్లాడారు. ఆమెను నేను అడిగిన 2 తేలికపాటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు'' అని పేర్కొన్నారు.

ఈ ట్వీట్‌తోపాటు శుక్రవారం పార్లమెంటులో ఆయన అడిగిన 2 ప్రశ్నలకు సంబంధించిన వీడియోను జత చేశారు. ఈ వీడియోను చూసి, షేర్ చేయాలని కోరారు. ఈ రెండు ప్రశ్నలకు 'ఔను' లేదా 'కాదు' అని సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు.

1. అనిల్ అంబానీకి ఆఫ్‌సెట్ కాంట్రాక్ట్ ఎవరు ఇచ్చారు?

2. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఒప్పందానికి బైపాస్ సర్జరీ చేసినపుడు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు అభ్యంతరం లేవనెత్తారా? ఈ ప్రశ్నలను మోదీని అడగాలని రాహుల్ గాంధీ కోరారు.

సీబీఐ వలలో తెలంగాణ ఐఏఎస్



- యూపీ కేడర్ చంద్రకళ ఇళ్లల్లో సీబీఐ సోదాలు
- అక్రమ ఇసుక మైనింగ్ కేసులో 12 చోట్ల తనిఖీలు
- అలహాబాద్ హైకోర్టు ఆదేశాలతో సీబీఐ కేసు
- అవినీతిపరులకు సింహస్వప్నంగా చంద్రకళ
- కావాలనే కేసులో ఇరికించారని అనుమానాలు

లఖ్‌నవూ/న్యూఢిల్లీ, జనవరి 5: అక్రమ ఇసుక తవ్వకాల కేసుకు సంబంధించి తెలంగాణకు చెందిన యూపీ కేడర్ ఐఏఎస్ అధికారిణి చంద్రకళ ఇంట్లో సీబీఐ శనివారం దాడులు నిర్వహించింది. ఉత్తరప్రదేశ్, ఢిల్లీలోని ఆమెకు సంబంధించి 12 చోట్ల సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. జలౌన్, హమీర్‌పూర్, లఖ్‌నవ్‌తోపాటు ఢిల్లీలో తనిఖీలు కొనసాగాయి. ఇసుక కుంభకోణంపై అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దాడులు నిర్వహించామని సీబీఐ అధికారులు తెలిపారు. చంద్రకళ స్వస్థలం తెలంగాణలోని కరీంనగర్ జిల్లా రామగుండం కావడం గమనార్హం. యూపీ క్యాడర్ అధికారి అయిన ఈ తెలంగాణ తేజం.. 2014లో నాసిరకం రోడ్లు వేసిన అధికారులను, కాంట్రాక్టర్లను పబ్లిగ్గా నిలదీసి సంచలనం సృష్టించారు. ఓయూ నుంచి ఎంఏ పట్టా పుచ్చుకున్న చంద్రకళ 2008లో ఐఏఎస్ టాపర్‌గా నిలిచారు. బులంద్‌షహర్, బిజ్నోర్, మీరట్ జిల్లాల కలెక్టర్‌గా ఆమె స్వచ్ఛభారత్ కోసం ఎంతగానో కృషి చేసి పేరు తెచ్చుకున్నారు. అవినీతిపై నిప్పులు చెరిగే అధికారిగా సామాజిక మాధ్యమాల్లో చంద్రకళ పేరు మారుమోగింది. బిజ్నోర్‌ను బహిరంగ మలవిసర్జనరహిత జిల్లాగా మార్చేందుకు ఆమె చేపట్టిన చర్యలు కేంద్ర సర్కారు ప్రశంసలు పొందాయి. ఇప్పుడామె నిజాయితీకి, కృషికి గుర్తింపుగా ప్రధాని నరేంద్రమోదీ ఆమెను తన డ్రీమ్‌టీంలో చేర్చుకున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్‌గా, కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఉపకార్యదర్శిగా నియమించారు. దీంతో ప్రస్తుతం మీరట్ కలెక్టర్‌గా ఉన్న చంద్రకళ కార్యరంగం ఢిల్లీకి మారింది. ఈమె ఎల్లప్పుడూ క్రమశిక్షణకు పెద్దపీట వేస్తారు. గత ఫిబ్రవరి 1న ఓ కార్యక్రమానికి వెళ్లినప్పుడు 18 సంవత్సరాల యువకుడు సెల్ఫీలతో చిరాకు తెప్పిస్తే అతడిని 14 రోజులు పోలీసు కస్టడీకి పంపారు. అనుమతి లేకుండా ఇతరులతో సెల్ఫీలు దిగడం భావ్యం కాదని తర్వాత ఓ ఇంటర్వ్యూలో కుండబద్దలు కొట్టారు. అనేక సంచలనాలకు కేంద్ర బిందువైన చంద్రకళ.. కాంట్రాక్టర్ల అవినీతిని నిలదీసిన వైనం సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్‌గా మారి దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఇదేనా మీ పనితీరు? దీనికి మీరు జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇది ప్రజల సొమ్ము. ముడుపులకూ ఓ హద్దుంటుంది అని ఆమె గర్జించిన తీరు అబ్బురపరిచింది. ఇటు కాంట్రాక్టర్లు, అటు అధికారులపై ఏకకాలంలో యుద్ధాన్ని ప్రకటించడం ఆమె సాహసానికి అద్దం పట్టింది. మీ మీద ఎఫ్ఐఆర్ బుక్ చేయాలి. కొంత సిగ్గు తెచ్చుకోండి. మీలో నీతి చచ్చిపోయింది. రెండురోజుల్లో కొత్త టైల్స్‌తో రోడ్డు నిర్మాణం మొదలు కావాలి. లేకుంటే మిమ్మల్ని బ్లాక్‌లిస్టులో పెట్టాల్సి ఉంటుంది అంటూ పరుగులు పెట్టించారు. అయితే.. కొందరు నేతలు, అధికారుల కుట్రల వల్లే చంద్రకళపై కేసు నమోదయినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

శబరిమలలో రణం

- కొనసాగుతున్న ఆందోళనలు
- సీపీఐ ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ ఇంటిపై దాడి
- పలు జిల్లాల్లో సీపీఎం, బీజేపీ కార్యకర్తల ఘర్షణలు
- అనేక చోట్ల తీవ్ర ఉద్రిక్తత.. నిషేధాజ్ఞలు విధింపు





తిరువనంతపురం, జనవరి 5: వరుసగా మూడో రోజు కేరళ రణరంగాన్ని తలపిస్తోంది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పించడంపై... హిందూ సంస్థలు చేపట్టిన ఆందోళనలు శనివారం కూడా కొనసాగాయి. ఇప్పటివరకు పోలీసులు 1800 మందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేశారు. కన్నూర్‌లోని ఇరిత్తి ప్రాంతంలో సీపీఎం పార్టీకి చెందిన కార్యకర్తపై శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కొందరు ఆందోళనకారులు దాడికి దిగారు. కత్తితో పొడిచారు. ఈ ఘటనలో గాయపడిన కార్యకర్తను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇక ఎమ్మెల్యే ఏఎన్ షంషీర్ ఇంటిపై కూడా దాడి జరిగింది. తలస్సేరీ ప్రాంతంలో బీజేపీ ఎంపీ వి.మురళీ ధరన్ నివాసంపై బాంబులు విసిరారు. ఆ సమయంలో ఎంపీ కుటుంబసభ్యులు ఇంట్లో నిద్రిస్తున్నారు. అయితే ఈ ఘటనలో ఎంపీ కుటుంబ సభ్యులకు ఎలాంటి హానీ జరగలేదు. శనివారం తెల్లవారు జామున స్థానిక ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి ఆందోళన కారులు నిప్పుపెట్టారు.



కోజికోడ్ జిల్లాలోనూ సీపీఎం, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. శనివారం ఉదయం వరకు ఆందోళనలు ఏ మాత్రం సద్దుమ ణుగలేదు. దీంతో ఉద్రిక్తత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. తలస్సేరి ఎమ్మెల్యే సీపీఎం నాయకుడు ఏఎన్ షమీర్ నివాసంతోపాటు పలుచోట్ల శుక్రవారం రాత్రి బాంబు దాడులు జరిగాయి. షమీర్ ఇంటిపైకి దుండగులు నాటు బాంబులు విసిరారు. ఇరిట్టి ప్రాంతంలో సీపీఎం కార్యకర్త కత్తిపోట్లకు గురయ్యా డు.



రాష్ట్రంలో దాడులకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కుట్రలు చేస్తోందని షమీర్ ఆరోపించారు. కల్లోల పరిస్థితులను సృష్టించి హింసను ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తన ఇంటిపై దాడి వెనుక సీపీఎం హస్తం ఉందని మురళీధరన్ ఆరోపించారు. ఆందోళనకారుల దాడుల్లో 99 ఆర్టీసీ బస్సులకు నష్టం వాటిల్లింది. ధ్వంసమైన బస్సులతో ఆర్టీసీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. కన్నూరు జిల్లాలో ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి దుండగులు నిప్పు పెట్టారు. ఉద్రిక్త పరి స్థితుల నేపథ్యంలో మరిన్ని భద్రతా బలగాలను తరలించారు. హింసాత్మక ఘటనలు కొనసాగే అవకాశ ముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి.

ఎందుకు శుద్ధి చేశారు?

ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన ప్రధాన పూజారి రాజీవరు కందరావ్‌ను ట్రావెన్‌కోర్ దేవస్థానం పాలకమండలి వివరణ కోరింది. బిందు, కనకదుర్గ అనే మహిళలు ఆలయంలోకి ప్రవేశించిన తరువాత ప్రధాన పూజారి భక్తులందరినీ బయటికి పంపించి, తలుపులు మూసి సుమారు గంట సేపు గర్భగుడిలో సంప్రోక్షణ నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఆయనను పాలక మండలి వివరణ అడిగింది.

ప్రధాని మోదీ ర్యాలీ వాయిదా..

కేరళలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపర్యటన వాయిదా పడింది. 'జనవరి 6న పతాన్‌మత్తిట్టాలో జరగాల్సిన ప్రధాని మోదీ పర్యటన ఇతర కార్యక్రమాల కారణంగా వాయిదా పడింది. కేరళలో ప్రస్తుత పరిస్థితులకు, ప్రధాని పర్యటన వాయిదా పడటానికి సంబంధం లేద'ని బీజేపీ ప్రకటించింది. ఈ ఏడాది దక్షిణాదిలో ప్రధాని మోదీ పాల్గొనబోయే మొదటి రాజకీయ ర్యాలీ ఇదే.

చట్టాన్ని అందరూ గౌరవించాలి: ఐరాస

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో నెలకొన్న వివాదంపై ఐక్య రాజ్య సమితి స్పందించింది. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన విషయాన్ని ఐరాస ప్రస్తావించింది. అందరూ చట్టాన్ని గౌరవించాలని ఐరాస ప్రోత్సహిస్తుందని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్, ఉప అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ వెల్లడించారు. ఈ విషయంపై భారతదేశ సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని, కాబట్టి ఆ విషయాన్ని భారత్‌లోని అధికారులకే వదిలేయాలని తెలిపారు.



అయ్యప్పను దర్శించుకున్న 8 మంది మహిళలు..

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఇప్పటివరకు 8 మంది మహిళలు (రుతుక్రమ వయసులో ఉన్నవారు) శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారని కేరళ పోలీసులు వెల్లడించారు. అయితే ఇద్దరు మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన విషయం మాత్రమే అందరికి తెలిసింది. 42 ఏళ్ల బిందు అమ్మిని, 41 ఏళ్ల కనకదుర్గ.. బుధవారం (రెండో తారీఖు) తెల్లవారుజామున అయ్యప్పను దర్శించుకోవడం పెను వివాదానికి దారి తీసింది. ఈ వ్యవహారంపై కేరళలో ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న మహిళలు ప్రవేశించరాదని ఉన్న నిషేధాన్ని సుప్రీంకోర్టు 2018, సెప్టెంబర్‌లో కొట్టివేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఎనిమిది మంది మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించారన్న పోలీసుల వాదనను శబరిమల కర్మ సమితి తోసిపుచ్చింది. ఎక్కువ మంది మహిళలు శబరిమలకు తరలిరావాలన్న కుట్రలో భాగంగా ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించింది. అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించేందుకు శ్రీలంక మహిళ శశికళ చేసిన ప్రయత్నాన్ని ప్రహసనంగా వర్ణించింది.



జ్యుడీషియల్ కస్టడీకి క్రిస్టియన్ మైఖెల్


న్యూఢిల్లీ, జనవరి 5: అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో మధ్యవర్తిగా ఉన్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రిస్టియన్ మైఖెల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీచేసింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై మైఖెల్‌ను విచారించేందుకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పెషల్ జడ్జి అరవింద్ కుమార్‌ను కోరింది. దుబై నుంచి మనదేశానికి మైఖెల్‌ను తరలించిన ఈడీ, హెలికాప్టర్ల కుంభకోణంలో విచారణ జరుపుతోంది. తిహార్ జైలులో ఉన్న మైఖెల్‌ను సీబీఐ కూడా విచారించింది.

వాద్రా సన్నిహితుడు అరోరా అరెస్టుకు పిటీషన్

న్యూఢిల్లీ, జనవరి 5: రాబర్ట్ వాద్రాకు అత్యంత సన్నిహితుడైన మనోజ్ అరోరాపై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసేందుకు అనుమతించాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ కోర్టును శనివారం కోరింది. మనీ లాండరింగ్ కేసులో మనోజ్ అరోరాను విచారించాలని ఈడీ ప్రయత్నిస్తోంది. ఈమేరకు పలు మార్లు సమన్లు జారీచేసినప్పటికీ విచారణకు అరోరా గైర్హాజరు అయ్యారని, అందుకే అరెస్టు వారెంటు జారీ చేసేందుకు అనుమతి కోరుతున్నట్టు కోర్టుకు ఈడీ వెల్లడించింది. ఈ కేసులో అరోరా అత్యంత కీలకమైన వ్యక్తిగా ఈడీ పేర్కొంది. దేశం వెలుపల వాద్రా నిర్వహించిన పలు లావాదేవీలపై, అక్కడ ఆయన కూడబెట్టిన ఆస్తుల గురించి అరోరాకు సర్వం తెలుసునని, ఈ విషయంలో వాద్రాకు అడుగడుగునా ఆర్థికంగా సహకరించింది కూడా అరోరానే అంటూ ఏజెన్సీ పేర్కొంది. యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి వాద్రా స్వయంగా అల్లుడు కావడంతో పెద్దలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయని, పలు అక్రమ ఆర్థికలావాదేవీల్లో వాద్రా పేరు తరచూ వినిపిస్తోంది.

రైతులు.. కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు

- మాకు మాత్రం అన్నంపెట్టే 'అన్నదాత'లు
- కాంగ్రెస్, బీజేపీకి తేడా ఇదే: మోదీ



రాంచీ, జనవరి 5: ఇటీవల గెలిచిన మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు రుణ మాఫీ చేయడంపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు రైతులు ఓటు బ్యాంకు వంటివారని, కానీ తమకు మాత్రం తిండిపట్టే అన్నదాతలు అని అన్నారు. కాంగ్రెస్‌కూ, బీజేపీకీ తేడా అదేనని చెప్పారు. జార్ఖండ్‌లోని పలములో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తి చేసి ఉంటే వారు రుణాలు అడిగే పరిస్థితే ఉండేది కాదన్నారు. వారికి అప్పుల అవసరం ఉండదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే నేడు ఈ దుస్థితి నెలకొందన్నారు. తొలుత రైతులను రుణాలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు, ఇప్పుడేమో ఆ రుణాలు రద్దు చేస్తున్నామని చెప్పి వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని మోదీ అన్నారు. ఒకవేళ నార్త్ కోయల్ ప్రాజెక్టును కట్టి ఉంటే, రైతులకు అప్పు తీసుకునే పరిస్థితి వచ్చేది కాదన్నారు. వ్యవసాయ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రైతులకు అన్యాయం చేశారని కాంగ్రెస్ పార్టీని మోదీ తప్పుపట్టారు. తమ ప్రభుత్వం రైతుల లాభం కోసం పనిచేస్తోందని, వ్యవసాయ ప్రాజెక్టులను పూర్తి చేసి వారిని శక్తివంతం చేస్తోందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం తమ ప్రభుత్వం లక్ష కోట్లు కేటాయించినట్లు తెలిపారు. '' కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే రైతులు లబ్ధి పొంది ఉండేవారు. రుణాలు తీసుకోవాల్సిన అవసరం వారికి ఉండేది కాదు. తొలుత రుణాలు తీసుకోవాలని రైతులను బలవంతం చేసి, ఇప్పుడు రుణ మాఫీ పేరుతో వారిని తప్పుదారి పట్టిస్తున్నారు' అని ప్రధాని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రజలకు 1 కోటి 25 లక్షల ఇళ్లు ఇచ్చిందన్నారు. ప్రధాని తన పర్యటనలో భాగంగా నార్త్ కోయిల్ (మండల్ డ్యామ్) ప్రాజెక్టు, కన్హర్ స్టోన్ పైప్‌లైన్ ఇరిగేషన్ సిస్టమ్‌కు శంకుస్థాపన చేశారు. మండల్ డ్యామ్‌ను రూ.2,391.36 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. ఈ డ్యామ్ పూర్తయితే 19,604 హెక్టార్ల భూమిని సాగునీరు అందనుంది. అలాగే, తాము ఏ ప్రాజెక్టులకు కూడా గాంధీ పేర్లను తగిలించలేదన్నారు. ''నరేంద్రమోదీ అవాస్ యోజన.. నమో ఆవాస్ యోజన.. లేదా రఘుబార్ దాస్ ఆవాస్ యోజన వంటి పేర్లను పెట్టలేదు. మేం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పేరునే పెట్టాం. ఇలా చేయడం వల్ల తదుపరి ప్రధాని అయ్యే వాళ్లు ఆ పథకాన్ని ముందుకు తీసుకెళ్లే అవకాశముంది'' అని ప్రధాని అన్నారు. అనంతరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు ఇళ్లను ప్రధాని మోదీ అప్పగించారు.

కుంభకోణం ఎక్కడుంది?

- గోరంతలు కొండంతలు చేస్తున్నారు..
- నేను చేసినవి పౌర లావాదేవీలే
- ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించరాదు
- అఫిడవిట్‌లో నీరవ్ మోదీ!



న్యూఢిల్లీ, జనవరి 5: బ్యాంకులకు వేల కోట్ల రూపాయల కుచ్చు టోపీ పెట్టి దేశం విడిచి పారిపోయిన నీరవ్ మోదీ సరికొత్త వాదనను తెరమీదకు తెస్తూ అందరికీ షాక్ ఇచ్చారు. తాను ఎటువంటి కుంభకోణానికి పాల్పడలేదని, పైపెచ్చు తాను చేసినవన్నీ పౌర లావాదేవీలేనంటూ తన న్యాయవాది ద్వారా పంపిన అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్నారు. మోదీ అక్రమాలపై విచారణ జరుపుతున్న యాంటీ-కరప్షన్ కోర్టుకు వ్యక్తిగత న్యాయవాది ద్వారా తన స్పందనను తెలియజేసిన ఆయన..ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ యాక్ట్-2018 కింద తనను ఆర్థిక నేరస్థుడిగా పేర్కొనరాదన్నారు. తానేం తప్పు చేయలేదంటూ.. గోరంతలుని కొండంతలు చేసి చూపుతున్నారని అఫిడవిట్‌లో మోదీ వెల్లడించడం సంచలనం సృష్టిస్తోంది.

భారత్ రాలేను

భద్రతా కారణాల వల్ల తాను భారత్‌కు రాలేనని మరో మారు స్పష్టం చేసిన ఆయన, సొంత గడ్డపై తన ప్రాణాలకు ముప్పుందన్నారు. తనపై తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్న ప్రజలు మూకదాడులకు పాల్పడి ప్రాణాలు హరిస్తారని గతంలో కూడా మోదీ ఆందోళన వ్యక్తం చేస్తూ, స్వదేశంలో అడుగుపెట్టేందుకు తిరస్కరించారు. ప్రస్తుతం నీరవ్ మోదీ లండన్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

గీతాంజలితో పాటు పలు బ్రాండ్ల పేరుతో డైమండ్ వ్యాపారం చేసిన నీరవ్ మోదీ తన మామ మేహుల్ చోక్సీతో కలిసి పంజాబ్ నేషనల్ బ్యాంకుకు 13 వేల కోట్ల రూపాయలు ఎగరగొట్టారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పలు మార్లు వీరికి సమన్లు జారీచేసినా విచారణకు భారత్‌కు రాకపోగా తమ న్యాయవాదుల ద్వారా సరికొత్త వాదనలు తెరపైకి తెస్తున్నారు. కాగా చోక్సీ ప్రస్తుతం కరీబియన్ దీవుల్లోని యాంటిగువా బార్బుడాస్ దీవులకు పోయి ఆశ్రయం పొంది, అక్కడ పౌరసత్వం స్వీకరించారు. మరోవైపు ఇటు లండన్‌కు అటు కరీబియన్ దీవులకు రెండు ప్రభుత్వాలకు మోదీ, చోక్సీలను అప్పగించాలంటూ మన దర్యాప్తు సంస్థలు విజ్ఞప్తులు పంపాయి. ఆర్థిక నేరాల చట్టం కింద మద్యం వ్యాపారి విజయ్ మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించిన కేంద్ర దర్యాప్తు సంస్థలు తాజాగా మోదీ, చోక్సీలపై దృష్టి నిలిపాయి. ఇప్పటికే డిసెంబరులో గ్లోబల్ పోలీస్ బాడీ ఇంటర్‌పోల్ (ఇంటర్నేషనల్ పోలీస్) చోక్సీపై రెడ్ కార్నర్ నోటీసు జారీచేసింది. సీబీఐ విజ్ఞప్తి మేరకే ఇంటర్‌పోల్ ఈ చర్యలు చేపట్టింది. మరోవైపు కామన్‌వెల్త్ దేశాల చట్టాల కింద మేహుల్ చోక్సీని భారత్‌కు అప్పగించాల్సిందిగా కరీబియన్ దీవులను భారత ప్రభుత్వఅధికారులు కోరారు. గత నెల డెట్ రీకవరీ ట్రిబ్యునల్ నీరవ్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులు, కంపెనీలకు 7 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సిందిగా ఆదేశించింది.

టెస్టు బౌలర్‌గా నేను మెరుగుపడాలి

- టీమిండియా స్పిన్నర్ కుల్‌దీప్

సిడ్నీ: టెస్టు క్రికెట్‌లో మరింత రాణించాలంటే బౌలర్‌గా తాను ఇంకా మెరుగుపడాలని భారత యువ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అభిప్రాయపడ్డాడు. 'నిజాయతీగా చెప్పాలంటే నేనేమీ మారలేదు. (ఆస్ట్రేలియాలో బౌలింగ్ చేయడంపై) ఈ సిరీస్‌లో నా తొలి టెస్టును ఆడుతుండటంతో కాస్త ఒత్తిడికి గురయ్యా. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో నేను ఇంకా ఎన్నో రెట్లు మెరుగుపడాలి. ఎన్ని టెస్టు మ్యాచ్‌లాడితే, అంత మెరుగుదుపడతా. ఒక బ్యాట్స్‌మెన్ ఆటతీరును అర్థం చేసుకోవడానికి, మరింత రాణించడానికి టెస్టు క్రికెట్‌లో మాత్రమే అవకాశం ఉంది. నాపై చాలా ఒత్తిడి ఉంది. ఒక లెగ్ స్పిన్నర్‌గా నేను కుదురుకోవడానికి కనీసం పదిరోజుల సమయం పడుతుంది'అని కుల్‌దీప్ అన్నాడు.

మహిళల క్రికెట్ వృద్ధికి అహం అవరోధం

- టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్

న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్‌కి వ్యక్తిగత 'ఇగో'లతో చేటు జరిగే అవకాశముందని దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ హెచ్చరించాడు. ఇటీవల భారత మహిళల జట్టు కోచ్ నియామకం కోసం అభ్యర్థులకి కపిల్‌దేవ్ నాయకత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించి..




డబ్ల్యూవీ రామన్‌ని కోచ్‌గా ఎంపిక చేసిన విషయం సంగతి తెలిసిందే. కానీ.. బీసీసీఐ పాలకుల కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం రామన్ ఎంపికని తప్పుబడుతూ.. కోచ్‌గా రమేశ్ పొవార్‌ని ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ.. కపిల్‌దేవ్ కమిటీపై విమర్శలు గుప్పించింది. పాలకుల కమిటీ చైర్మన్ వినోద్ రాయ్.. రామన్ ఎంపికని సమర్థిస్తూ సంతకం చేయగా.. ఎడుల్జీ మాత్రం సంతకం చేయకుండా.. ఆలస్యం చేసినట్లు వెలుగులోకి రావడంతో కపిల్‌దేవ్ ఘాటుగా స్పందించాడు. వాస్తవానికి రమేశ్ పొవార్‌కే కోచ్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. కానీ.. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో కీలకమైన సెమీస్ మ్యాచ్‌లో మిథాలీ రాజ్‌ని పక్కన పెట్టడం, ఆ తర్వాత ఈ అంశంపై పెద్ద ఎత్తున నోరు జారడంతో.. అతడికి మరోసారి బీసీసీఐ అవకాశం ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేసింది. 'మహిళల జట్టు కోచ్ నియామకంపై చెలరేగిన వివాదం నన్ను చాలా బాధించింది. ఇక్కడ ఎవరి పేరునీ నేను ప్రస్తావించదలుచుకోలేదు. కానీ.. వ్యక్తిగత అహం.. దేశంలో మహిళల క్రికెట్ వృద్ధికి అవరోధంగా మారుతోంది. ప్రతి ఒక్కరికీ కొన్ని ఇష్టా అయిష్టాలు ఉంటాయి. అంతమాత్రానా.. వాటిని జట్టుపై రుద్దడం సమంజసం కాదు' అని కపిల్‌దేవ్ అన్నారు.

ఫైనల్లో నిఖత్ జరీన్

- నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్: జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కిలోల) విభాగంలో ఫైనల్‌కు చేరి కనీస రజత పతకాన్ని ఖాయం చేసుకుంది. కర్ణాటకలోని విజయనగరలో జరుగుతోన్న ఈ పోటీల్లో శనివారం జరిగిన సెమీఫైనల్లో నిఖత్ జరీన్ 5-0తో మణిపూర్‌కు చెందిన వాన్లల్ దుతిపై గెలుపొంది ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో తెలంగాణకు చెందిన సారా ఖురేషీ (81 కిలోల) విభాగంలో మహారాష్ట్రకు చెందిన బాక్సర్ మోహిని చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే.





సిరీస్ విజయం ఖరారు

మూడో రోజు వరుణిడి ఆటంకం

- ఆసీస్‌ను దెబ్బతీసిన స్పిన్నర్లు
- డ్రా దిశగా చివరి, నాల్గో టెస్టు

సిడ్నీ: ఏడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న టెస్టు సిరీస్ విజయానికి టీమిండియా చేరువైంది. ఇక్కడ జరుగుతున్న చివరి, నాల్గో టెస్టు మ్యాచ్‌లో వెలుతురు సరిగా లేకపోవడం, వర్షం కురవడం వంటి కారణాలతో మూడో రోజు ఆట గంట ముందే ఆగిపోయింది. ఆట నిలిచిపోయే సమయానికి ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ఇంకా 386 పరుగులు వెనకబడివుంది. చేతిలో నాలుగు వికెట్లు ఉన్నాయి. ఇంక రెండ్రోజుల ఆట మాత్రమే మిగిలివుంది. ఈ రెండ్రోజుల్లో ఇరు జట్లూ రెండో ఇన్నింగ్స్ ఆడటం అసాధ్యం. అంటే మ్యాచ్ డ్రా అవుతుందని ప్రస్తుత పరిస్థితులను బట్టి స్పష్టంగా అర్థమవుతోంది. అంటే ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలవడమనే 71 ఏళ్ల నిరీక్షణకు కొన్ని గంటలు మాత్రమే ఉన్నాయి. 1947-48 సీజన్‌లో లాల అమర్‌నాథ్ నేతృత్వంలోని టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లింది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 4-0తో కోల్పోయింది. ఆ తర్వాత 11సార్లు టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పటికీ ఇప్పటి వరకు టెస్టు సిరీస్‌ను గెలవలేదు.

ఇప్పుడు సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో వెలుతురు సరిగా లేకపోవడం, వర్షం వంటి కారణాలతో ఒక గంట ముందుగానే ఆట నిలిచిపోయింది. కుల్‌దీప్ యాదవ్, రవీంద్ర జడేజా ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు. దీంతో టీమిండియా ప్రత్యర్థిని శాసించే స్థితికి చేరుకుంది. శనివారం ఆట ముగిసే సమయానికి పీటర్ హాండ్స్‌కాంబ్, పాట్ కమ్మిన్స్ క్రీజులో ఉన్నారు. భోజన విరామం తర్వాత ఆస్ట్రేలియా పరిస్థితి దారుణంగా తయారైంది. అర్ధ సెంచరీ పూర్తి చేసిన మార్కస్ హారిస్ అవుటయ్యాడు. జడేజా వేసిన బంతి హారిస్ బ్యాట్ అంచుకు తాకి వికెట్ల పైకి వెళ్లింది. మరో ఆరు ఓవర్ల తర్వాత జడేజాకు మరో వికెట్ దక్కింది. షాన్ మార్ష్ స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆస్ట్రేలియా అతి కష్టం మీద 52వ ఓవర్లో 150 పరుగులు పూర్తి చేసింది. తొలి సెషన్ తొలి గంట వ్యవధిలో 35 పరుగులు మాత్రమే వచ్చాయి. అయితే రెండో గంట వ్యవధిలో బ్యాటింగ్ జోరు పెరిగింది. 41 పరుగులు వచ్చాయి. అయితే టీమిండియా మరో రెండు వికెట్లు తీయడం ఆస్ట్రేలియా బ్యాటింగ్ మళ్లీ మందగించింది. మహ్మద్ షమీ బౌలింగ్‌లో మార్నస్ లబుషేన్ ఇచ్చిన క్యాచ్‌ను షార్ట్ మిడ్‌వికెట్ స్థానంలో ఉన్న అజింక్య రహానే అద్భుతంగా డైవ్ కొట్టి క్యాచ్ పట్టాడు. కానీ మరోసారి పరిస్థితులు చక్కబడినట్టు కనిపించాయి. కానీ కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ అతనికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

వికెట్ నష్టపోకుండా 24 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మూడో రోజు శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్టేలియా ఉదయం సెషన్‌లో బాగానే ఆడింది. భోజన విరామ సమయానికి 1 వికెట్ నష్టపోయి 122 పరుగులు చేసింది. మార్నింగ్ సెషన్‌లో భారత పేసర్లు షమీ, జస్‌ప్రీత్ బుమ్రాలకు పిచ్ అంతగా సహకరించలేదు. దీంతో ఆస్ట్రేలియా 7 ఓవర్లలో 50 పరుగులు చేసింది. 30 ఓవర్లలో 100 పరుగుల మార్కును దాటింది. మార్నింగ్ సెషన్‌లో కుల్‌దీప్ మాత్రమే వికెట్ లభించింది. కుల్‌దీప్ వేసిన బంతికి లూజ్ షాట్ కొట్టిన ఉస్మాన్ ఖవాజా మిడ్‌వికెట్ స్థానంలో ఉన్న చటేశ్వర్ పుజారా చేతికి చిక్కాడు. తర్వాత ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌ను కంట్రోల్ చేయడానికి జడేజా ఇబ్బంది పడ్డాడు. జడేజా వేసిన ఒక ఓవర్లో హారిస్ మూడు ఫోర్లు కొట్టాడు. దీంతో హారిస్ 67 బంతుల్లో రెండవ టెస్టు అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించినప్పటికీ శనివారం మరోసారి టాపార్డర్ కుప్పకూలింది. ఫాలో ఆన్ నుంచి తప్పించుకోవాలంటే పీటర్‌స్కాంబ్, పాట్ కమ్మిన్స్ భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాల్సివుంటుంది. చివరి సెషన్‌లో ఆసీస్ టెస్టు కెప్టెన్ టిమ్ పెయిన్‌ను కుల్‌దీప్ అవుట్ చేసిన తర్వాత వీరిద్దరూ అజేయ 38 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కానీ నాలుగో రోజు ఆటలో వీరు చేయాల్సిన పని చాలా వుంది. టాపార్డర్ బ్యాట్స్‌మెన్ తమ ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించారు. కానీ భారీ స్కోర్లు చేయడంలో విఫలమయ్యారు. జట్టు అవసరాన్ని బట్టి ఆడటంలో ఓపెనర్ మార్కస్ హారిస్, ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్ పూర్తిగా విఫలమయ్యారు. కానీ ప్రస్తుతానికి హారిస్ (79) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మార్నస్ లబుషేన్ బౌలింగ్‌లో అంతగా రాణించకపోయినప్పటికీ బ్యాటింగ్‌లో 38 పరుగులు చేసి ఫరవాలేదనిపించాడు. షమీ బౌలింగ్‌లో మార్నస్ మిడ్‌వికెట్‌లో ఉన్న రహానేకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత పరిస్థితులు ఏమాత్రం చక్కబడలేదు.

నాలుగు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే 2-1 ఆధిక్యంతో ఉన్న సంగతి తెలిసిందే.



స్కోరుబోర్డు

ఇండియా తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు: 24/0): మార్కస్ హారిస్ (బి) జడేజా 79, ఉస్మాన్ ఖవాజా (సి) పుజారా (బి) కుల్‌దీప్ 27, మార్నస్ లబుషేన్ (సి) రహానే (బి) షమీ 38, షాన్ మార్ష్ (సి) రహానే (బి) జడేజా 8, ట్రావిస్ హెడ్ (సి) అండ్ (బి) కుల్‌దీప్ 20, హాండ్స్‌కాంబ్ నాటౌట్ 28, టిమ్ పెయిన్ (బి) కుల్‌దీప్ 5, కమ్మిన్స్ నాటౌట్ 25; ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం 83.3 ఓవర్లలో 236/6; **వికెట్ల పతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198; **బౌలింగ్:** షమీ: 16-1-54-1, బుమ్రా: 16-4-43-0, జడేజా: 27.3-9-62-2, కుల్‌దీప్: 24-6-71-3.

పంత్ మరో గిల్‌క్రిస్ట్

- ఆసీస్ మాజీ కెప్టెన్ పాంటింగ్

సిడ్నీ: భారత యువ వికెట్ కీపర్/బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌ను ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ప్రశంసలతో ముంచెత్తారు. ప్రస్తుతం జరుగుతున్న నాలుగో టెస్టులో 159 పరుగులు చేసిన పంత్‌ను మరో గిల్‌క్రిస్ట్‌గా అభివర్ణించారు. 'అతనిలో నిజమైన ప్రతిభ ఉంది. అంతేకాకుండా అసాధారణమైన బాల్ స్ట్రైకర్ కూడా. అంతేకాకుండా మంచి గేమ్ సెన్స్ కూడా అతనికుంది. ఐపీఎల్‌లో అతను ఆడే ఢిల్లీకు నేను కోచ్‌గా ఉండటం నా అదృష్టం. కీపింగ్‌తో పాటు ఉత్తమమైన బ్యాట్స్‌మన్‌గా మారేందుకు అతను మరింత శ్రమించాలి. కామెంటరీ బాక్స్‌లో మేము మాట్లాడేటప్పుడు అతను మరో గిల్‌క్రిస్ట్ అవుతాడని అనుకున్నాం' అని ఓ క్రికెట్ వెబ్‌సైట్‌తో పాంటింగ్ అన్నాడు. ఆస్ట్రేలియా లెజెండరీ వికెట్ కీపర్/బ్యాట్స్‌మన్ గిల్‌క్రిస్ట్ 96 టెస్టులు ఆడి 47.60 సగటుతో 5,570 పరుగులు చేశారు. అంతేకాకుండా 287 వన్డేల్లో ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గిల్‌క్రిస్ట్ 35.89 సగటుతో 9,619 పరుగులు సాధించారు. ఈ నెల 4వ తేదీన పంత్ ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ చేసిన భారత తొలి వికెట్ కీపర్/బ్యాట్స్‌మన్‌గా ఘనత సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 622 పరుగుల వద్ద టీమిండియా డిక్లేర్ చేయడంతో పంత్ 159 పరుగులతో అజేయంగా నిలిచాడు. అంతేకాకుండా ఈ 21 ఏళ్ల వికెట్ కీపర్/బ్యాట్స్‌మన్ గత 13 ఏళ్లుగా మహేంద్ర సింగ్ ధోనీపై ఉండే రికార్డును బద్దలు కొట్టాడు. టెస్టుల్లో వ్యక్తిగత అత్యధిక స్కోరు చేసిన భారత వికెట్ కీపర్‌గా ధోనీ (148) 2006లో రికార్డు సృష్టించాడు. ధోనీ కంటే పంత్ మరిన్ని టెస్టు సెంచరీలు చేస్తాడని పాంటింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు.



మంత్రికి, షూటర్‌కు మధ్య మాటల యుద్ధం

- నగదు పురస్కారం వివాదం

హరియాణా: నగదు పురస్కారం హామీపై ట్విట్టర్ వేదికగా హరియాణా క్రీడల మంత్రి అనిల్ విజ్, మహిళా యువ షూటర్ మను భాకర్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ₹ 2 కోట్ల నగదు పురస్కారం హామీపై ట్విట్టర్‌లో 16 ఏళ్ల మను మంత్రిని ప్రశ్నించడంతో ఈ వాగ్వాదం మొదలైంది. గతేడాది అర్జెంటీనాలో జరిగిన యూత్ ఒలింపిక్స్‌లో మను భాకర్ స్వర్ణ పతకం గెలిచినందుకు గాను హరియాణా ప్రభుత్వం ₹ 1 కోటి నగదు పురస్కారాన్ని ప్రకటించింది. కానీ ₹ 2 కోట్లు ఇస్తామని డిసెంబర్ 27 మంత్రి హామీ ఇచ్చారు. విజ్ హామీ ఇచ్చినప్పటికీ ఫోటోలను కూడా ఆమె ట్విట్టర్‌లో పెట్టి 'ఇది నిజమేనా లేక ఉత్తుత్తి హామీనా' అంటూ మంత్రిని అడిగింది. దీనిపై స్పందించిన క్రీడల మంత్రి ఈ విషయాన్ని బహిరంగ పరిచే ముందు స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించివుంటే బాగుండేదని అన్నారు. 'ఈ విషయాన్ని పబ్లిక్‌లో పెట్టేముందుకు భకర్ ఒకసారి స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ వద్ద ధ్రువీకరించుకుని వుంటే బాగుండేది. అత్యున్నత పురస్కారాలు ఇస్తున్న ఈ దేశంలో భకర్ చర్య రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడమే అవుతుంది. నోటిఫికేషన్ విడుదలైన సమయానికి ఆమె నాకు ట్వీట్ చేసినట్టుగా భకర్‌కు ₹ 2 కోట్లు ఇస్తాం. కానీ ప్లేయర్స్‌లో క్రమశిక్షణ ఉండాలి. ఈ వివాదం సృష్టించిన భకర్ చింతించాలి. ఆమె ఇంకా చాలా కాలం క్రీడల్లో కొనసాగాల్సివుంది. ఆమె తన గేమ్‌పై మాత్రమే దృష్టి పెడితే మంచిది' అని మంత్రి విజ్ అన్నారు. ఝుజ్జర్‌లోని (హరియాణా) గొరియా గ్రామానికి చెందిన భకర్ యూత్ గేమ్స్‌లో స్వర్ణం గెలవడంతో పాటు తొలి వరల్డ్ కప్‌లో, కామన్వెల్త్ గేమ్స్‌లలో రజత పతకాలు గెలిచింది.





చాంపియన్ దివిజ్-బోపన్న జంట

- టాటా ఓపెన్ టెన్నిస్ టోర్నీ

పుణె: భారత్ టెన్నిస్ జంట దివిజ్ శరణ్- రోహన్ బోపన్న ఈ ఏడాదిని విజయంతో ప్రారంభించారు. టాటా ఓపెన్ ఏటీపీ-250 టోర్నమెంట్‌లో దివిజ్- బోపన్న ద్వయం ఫైనల్లో విజయం సాధించి విజేతగా నిలిచింది. శనివారమిక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ దివిజ్- బోపన్న జంట 6-3, 6-4తో బ్రిటిష్‌కు చెందిన లూకే బాంబ్రిడ్జ్- జానీ ఓ మారా జోడిపై విజయం సాధించి చాంపియన్‌గా అవతరించారు. ఈ విజయంతో బోపన్న 18వ ఏటీపీ టూర్ టైటిల్ సాధించగా... శరణ్ నాల్గో టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. బోపన్న- దివిజ్ జోడి 2018లో కేవలం ఆసియా గేమ్స్‌లో మాత్రమే బంగారు పతకం సాధించారు. తొలిసెట్ నుంచే పోటాపోటీగా ఆడిన బోపన్న జోడి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం కొనసాగించారు. వీరి ధాటికి లూకే జంట తొలి సెట్‌ను 6-3తో ఓడిపోవాల్సి వచ్చింది. తర్వాత జరిగిన రెండో సెట్‌లో కూడా బోపన్న జోడి అదే జోరుని కొనసాగించి సెట్‌తో పాటు మ్యాచ్‌ని కూడా గెలుపొందింది.

వన్డే సిరీస్ కివీస్‌దే

- పోరాడి ఓడిన శ్రీలంక
- తిసారా పెరీరా సెంచరీ వృథా

మౌంట్ మాంగనీ: న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో శ్రీలంక ఆల్‌రౌండర్ తిసారా పెరీరా (140) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అయినప్పటికీ కివీస్ జట్టు 21 పరుగులతో లంకపై విజయం సాధించి సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 319 పరుగులు చేసింది. అనంతరం 320 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన శ్రీలంక 128 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. దీంతో శ్రీలంక ఓటమి ఖాయమని అంతా భావించారు. అయితే, ఏడో స్థానంలో బరిలో దిగిన పెరీరా విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. 57 బంతుల్లో 8 ఫోర్లు, 13 సిక్స్‌ల సాయంతో సెంచరీ సాధించాడు. పెరీరాకు వన్డేల్లో ఇది తొలి సెంచరీ కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో శ్రీలంక టాప్ ఆర్డర్ విఫలం కాగా.. లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌తో కలిసి విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. చివర్లో లంక విజయానికి 22 బంతుల్లో 23 పరుగులు అవసరమయ్యాయి. ఈ దశలో పెరీరా కివీస్ బౌలర్ హెన్నీ బౌలింగ్‌లో ట్రెంట్ బౌల్ట్‌కు క్యాచ్‌తో చివరి వికెట్‌గా పెరీరా పెవిలియన్‌కు చేరాడు. దీంతో శ్రీలంక 298 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా రెండు వన్డేలు గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే న్యూజిలాండ్ సిరీస్‌ను సొంతం చేసుకుంది.ఈ మ్యాచ్‌లో అద్భుతమైన శతకంతో ఆకట్టుకున్న పెరీరాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com